

కాంగ్రెస్‌లో టికెట్ రేస్!

లోక్‌సభ పోరుకు హస్తం నేతలు ఉవ్విళ్లూరుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మహబూబాబాద్, వరంగల్ లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేందుకు పెద్దఎత్తున సిద్ధమవుతున్నారు. ఈ మేరకు ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే కాకుండా ఇతర ప్రాంతాల నేతలు కూడా హైదరాబాద్ గాంధీభవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ రెండుస్థానాల్లో ఏకంగా 90 మంది బరిలో ఉండేందుకు ఉత్సాహం చూపుతున్నారు. మానుకోటకు 48 మంది, వరంగల్‌కు 42మంది దరఖాస్తు చేసుకోవడంతో పోటీ ఏస్థాయిలో ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇదిలా వుండగా, ప్రభుత్వ ఉద్యోగులు సైతం పోటీకి సై అంటున్నారు. అయితే దరఖాస్తుల పరిశీలనకు ఏఐసీసీ ప్రదేశ్ ఎన్నికల కమిటీని నియమించింది. ఇందులోని సభ్యులు రెండు లోక్‌సభ స్థానాలకు అభ్యర్థులను ఎంపిక చేయనున్నారు. ఈ 90మందిలో ఎవరికి టికెట్ దక్కుతుందో చూడాలి మరీ..

- జనరల్ స్థానాల కంటే ఈ రెండు రిజర్వుడు స్థానాలకు భారీ డిమాండ్
- సీనియర్ నేతలతో పాటు అనేక మంది పోటాపోటీ
- బరిలో దిగేందుకు సై అంటున్న పలువురు ఉద్యోగులు
- అధిష్ఠానం ఆశీస్సుల కోసం ఢిల్లీ, హైదరాబాద్‌కు పరుగులు



వరంగల్ ఎంపీ స్థానానికి 42, మహబూబాబాద్‌కు 48 మంది దరఖాస్తు

వరంగల్, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో విజయం సాధించి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌లోని ఆశావహులు రాబోయే ఎంపీ ఎన్నికలపై దృష్టి పెట్టారు. ఇటీవల పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేయాలని ఆశిస్తున్న వారి నుంచి దరఖాస్తులు కూడా స్వీకరించింది. ఈ క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా 17ఎంపీ స్థానాలకు 309 దరఖాస్తులు రాగా, వీటిలో ఉమ్మడి వరంగల్ జిల్లాలోని వరంగల్, మహబూబాబాద్ ఎంపీ సీట్ల కోసం 90మంది దరఖాస్తు చేసుకున్నారు. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వుడైన ఈ రెండు స్థానాలకు ఇంత పెద్దమొత్తంలో దరఖాస్తులు రావటంపట్ల పార్టీలో ఆసక్తికర చర్చ జరుగుతుంది. సీనియర్ నేతలతో పాటు కొత్తగా టికెట్ ఆశించే వారిలో ప్రభుత్వ ఉద్యోగులూ ఉన్నారు. వారంతా పార్టీలో ఉన్న తమ గాడ్‌ఫాదర్ల ద్వారా టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో అభ్యర్థిత్వాలు ఎవరికి దక్కుతాయోనన్న ఉత్కంఠ కనిపిస్తోంది.

రెండు స్థానాలపై ఆశావహుల ఆశలు

కాంగ్రెస్ ఎంపీ టికెట్లకు భారీగా డిమాండ్ ఉండగా.. ఎస్టీ రిజర్వుడైన మహబూబాబాద్, ఎస్సీ రిజర్వుడ్ అయిన వరంగల్ స్థానాల్లో పోటీ చేసేందుకు ఆశావహుల నుంచి భారీ సంఖ్యలో దరఖాస్తులు అందాయి. రాజకీయంగా చైతన్యవంతమైన ఓరుగల్లు నుంచి పొలిటికల్ ఎంట్రీ ఇవ్వాలని పలువురు నేతలు, కొత్తగా రాజకీయాల్లోకి రావాలనుకుంటున్న వారు తహతహలాడుతున్నారు. నియోజకవర్గాల పునర్విభజనలో భాగంగా 2009లో మరోసారి మహబూబాబాద్ పార్లమెంట్ స్థానం ఏర్పడింది. 2009లో బలరామ్‌నాయక్ ఎంపీగా గెలిచి, మన్మోహన్‌సింగ్ కెబినేట్‌లో కేంద్ర సహాయ మంత్రిగా పని చేశారు. ఆ తరువాత 2014, 2019 ఎన్నికల్లో రెండు పర్యాయాలు బీఆర్ఎస్ అభ్యర్థులు ఎంపీలుగా గెలిచారు. వరంగల్ పార్లమెంట్ 1952లో ఏర్పడింది.



అయితే 2009లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన సిరిసిల్ల రాజయ్య విజయం సాధించగా, 2014లో బీఆర్ఎస్ నుంచి కడియం శ్రీహరి విజయం సాధించగా, 2016లో జరిగిన ఉప ఎన్నికతో పాటు 2019లో జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ అభ్యర్థి దయాకర్ విజయం సాధించారు. అప్పట్లో బీఆర్ఎస్ అధికారంలో ఉండటంతో వరుసగా రెండు పర్యాయాలు ఆ పార్టీకి అవకాశం వచ్చింది. అయితే ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావటమే కాకుండా ఈ పార్లమెంట్ స్థానాల పరిధిలోని అసెంబ్లీ సెగ్మెంట్లలో కాంగ్రెస్ ఓట్లు రెట్టింపు అయ్యాయి. దీంతో కాంగ్రెస్ టికెట్ కోసం భారీగా పోటి నెలకొంది. 2009 నాటి ఫలితాలను పునరావృతం చేయాలని భావిస్తున్న కాంగ్రెస్ అధిష్ఠానం అభ్యర్థుల ఎంపికపై తీవ్ర కసరత్తు చేస్తోంది.

రెండు సీట్లు.. 90మంది దరఖాస్తులు..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రెండు పార్లమెంట్ స్థానాలు ఉండగా, 90మంది ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 17పార్లమెంట్ స్థానాలకు కాంగ్రెస్ పార్టీ 3వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరించింది. వీటిలో ఎస్టీ రిజర్వుడు స్థానమైన మహబూబాబాద్‌కు అత్యధికంగా 48మంది టికెట్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వరంగల్ ఎంపీ టికెట్ కోసం 42మంది దరఖాస్తు చేసుకున్నారు. అత్యధిక దరఖాస్తుల్లో మొదటి రెండు స్థానాలు ఉమ్మడి జిల్లా ఎంపీ స్థానాలకే దక్కింది. వరంగల్ పార్లమెంట్ స్థానానికి ప్రధానంగా మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్యతో పాటు గత ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన దొమ్మాటి సాంబయ్య, సర్వే సత్యనారాయణ, అద్దంకి దయాకర్, డాక్టర్ రాగమల్ల పరమేశ్వర్‌తో పాటు ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్ హరికోట్ల రవి తదితరులు ఎంపీ టికెట్ కోసం దరఖాస్తులు చేసుకున్నారు. మహబూబాబాద్ టికెట్ కోసం ప్రధానంగా మాజీ కేంద్ర మంత్రి బలరామ్‌నాయక్‌తో పాటు బెల్లయ్య నాయక్, మోహన్‌లాల్, నెహ్రూనాయక్, నాగరాజు, సాంబయ్య తదితరులు టికెట్ రేసులో ఉన్నారు. వీరితో రెండు ఎంపీ స్థానాల కోసం సీనియర్ నేతలు, కొత్తగా పార్టీలో చేరి టికెట్ కోసం చాల మంది ఆశావహులు ప్రయత్నిస్తున్నారు.

పోటీకి పలువురు ఉద్యోగులు సై..

కాంగ్రెస్ టికెట్ ఆశించే వారి సంఖ్య రోజు రోజుకు పెరుగుతుండగా.. సీనియర్, జూనియర్ నేతలతో పాటు పలు ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నత స్థానంలో ఉన్న అధికారులు కూడా రాజకీయంగా తమ అదృష్టాన్ని పరీక్షించుకోవాలని ఉవ్విళ్లూరుతున్నారు. పలువురు పోటీకి సై అంటుండం

మిగతా 7వ పేజీలో..

ఐదుగురి పేర్లతో స్క్రీనింగ్

రాష్ట్రంలో ఎంపీ అభ్యర్థులను ఎంపిక చేసేందుకు ఏఐసీసీ ప్రదేశ్ ఎన్నికల కమిటీని నియమించింది. స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ హరీష్‌చౌదరి, జిగ్నేష్‌మేవాని, విశ్వజిత్ కదమ్‌లతో కమిటీని ఏర్పాటు చేశారు. ఈ కమిటీ గురువారం నుంచి 15వ తేదీలోపు తెలంగాణలో ఎంపీ టికెట్ కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించనున్నారు. మొత్తం 17 ఎంపీ స్థానాల నుంచి వచ్చిన మొత్తం 209 దరఖాస్తులను పరిశీలించనున్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి ముగ్గురు నుంచి ఐదుగురి పేర్లతో తొలి జాబితా తయారు చేయనున్నారు. తక్కువ దరఖాస్తుల వచ్చిన నియోజకవర్గాల్లో ముగ్గురు, ఎక్కువ దరఖాస్తులు వచ్చిన చోట నలుగురు, ఐదుగురితో జాబితా సిద్ధం చేయనున్నారు. వరంగల్ నుంచి 42, మహబూబాబాద్ నుంచి 48 దరఖాస్తులు రావటంతో ఒక్కో స్థానం నుంచి ఐదుగురితో జాబితా తయారు చేసి ఏఐసీసీకి పంపనున్నారు. ఈ ఐదుగురిలో చోటు దక్కిన వారి నుంచి ఒక్కరి టికెట్ ఖరారు చేసే బాధ్యతను ఏఐసీసీకే అప్పగించనున్నారు. దీంతో స్క్రీనింగ్ కమిటీ ఫైనల్ చేసే ఐదుగురిలో తమ పేరు ఉంటుందా అనే ఉత్కంఠ ఆశావహుల్లో నెలకొంది. 18వ తేదీ తరువాత అభ్యర్థులను ప్రకటించే అవకాశముందని కాంగ్రెస్ నేతలు పేర్కొంటున్నారు. దీంతో 90 మంది ఆశావహుల్లో టికెట్ దక్కే ఆ ఇద్దరు ఎవరో అనేది క్యాడర్‌లో ఉత్కంఠ రేపుతోంది.



మేడారం ఈవో కార్యాలయం ఉన్న దేవాదాయ శాఖ ధార్మిక భవనం

నిర్వహణ బహుదూరం!

- హనుమకొండలో మేడారం ఈవో కార్యాలయం
- జాతర కార్యకలాపాలన్నీ నగరం నుంచే..
- ప్రతీ చిన్న పనికి 130 కి.మీ దూరం వెళ్లాల్సిందే..
- ఇబ్బందులు పడుతున్న భక్తులు, పూజారులు



హనుమకొండ, ఫిబ్రవరి 7 (ఆంధ్రజ్యోతి): ఆసియాలోకెల్లా అతిపెద్ద గిరిజన జాతర అయిన మేడారంలో దేవాదాయ శాఖ కార్యనిర్వాహణ అధికారి కార్యాలయం లేకపోవడం గమనార్హం. సమ్మక్క-సారలమ్మల జాతర వ్యవహారాలను చూసే అత్యంత ముఖ్యమైన కార్యనిర్వహణాధికారి (ఈవో) కార్యాలయం మేడారానికి 130 కి.మీ. దూరంలో ఉన్న హనుమకొండలో ఉంది. సాధారణంగా ఆలయాల ఈవో ఆఫీసులు వాటి ప్రాంగణాల్లోనే ఉంటాయి. మేడారం విషయంలో మాత్రం ఇందుకు భిన్నం. అక్కడ జాతర... ఎక్కడో ఆఫీసు అన్నచందంగా ఉంది. దీంతో జాతర సందర్భంగా పూజారులు, అధికారులు భక్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ అంశాన్ని పూజారులు దేవాదాయ శాఖ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోవడం లేదన్న ఫిర్యాదులున్నాయి.

హనుమకొండలో ఈవో ఆఫీసు

మేడారం జాతర నిర్వహణ విషయంలో దేవాదాయ శాఖ అధికారులకు ఎక్కువ బాధ్యతలు ఉంటాయి. జాతర నిర్వహణను ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తుండాలి. పనులు సకాలంలో పూర్తయ్యేలా చూడాలి. జాతరలో కీలక భూమిక పోషించే పూజారులకు నిత్యం అందుబాటులో ఉండాలి. ఈవో కార్యాలయంలో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలి. కానీ ఇందుకు భిన్నంగా మేడారానికి 130 కి.మీ.దూరంలో వరంగల్‌లోని పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా గల ధార్మిక భవనంలో ఈవో కార్యాలయం కొనసాగుతోంది. పూజారులకు ఏ సమస్య వచ్చినా, ఏదీ కావాలన్నా, ఏ అనుమతి పొందాలన్నా, ఏదైనా అంశంపై

మిగతా 7వ పేజీలో..

గవర్నర్‌కు ఆహ్వానం



మేడారంలో ఈ నెల 21వతేదీ నుంచి 24వ వరకు జరిగే సమ్మక్క, సారలమ్మ మహాజాతరకు రావాలంటూ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్‌ను రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆహ్వానించారు. గురువారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌ను కలిసిన సీతక్క ప్రత్యేకంగా అమ్మవార్ల గద్దెల ప్రతిమలు, పసుపు, కుంకుమ భరిణలతో తయారుచేయించిన ఆహ్వానపత్రికతో పాటు చీరను అందించారు. సీతక్క వెంట కాంగ్రెస్ ములుగు జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, టీపీసీసీ అధికార ప్రతినిధి కూచన రవళిరెడ్డి ఉన్నారు. ఇక ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి కూడా సీతక్క మేడారం వడ్డెలతో(పూజారులు) కలిసి ఆహ్వానం అందించగా ఆయన 23న వనదేవతల దర్శనానికి రానున్నారు. - మేడారం

జిల్లా ఓటర్లు 7,63,589 మంది

తుది జాబితా విడుదల

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఓటరు తుది జాబితాను ప్రచురించినట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. గురువారం తుది జాబితా ప్రకారం జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,63,589 ఓటర్లు ఉన్నారు. ఇందులో పురుషులు 3,73,245 ఉండగా మహిళలు 3,89,979 ఉన్నారు. సాధారణ ఓటర్లతో పాటు మూడు నియోజకవర్గాల్లో కలిపి మొత్తం 591 సర్వీస్ ఓటర్లు ఉన్నారు. ఈ జాబితాను జిల్లా కలెక్టరేట్‌లో, ఆర్డీవో కార్యాలయం, తహసీల్దార్ కార్యాలయం, పోలింగ్‌కేంద్రాల్లో ప్రజల పరిశీలనార్థం అందుబాటులో ఉంచుతున్నట్లు కలెక్టర్ తెలిపారు. అన్ని రాజకీయ గుర్తింపు పొందిన పార్టీలకు ఓటరు జాబితా కాపీని అందజేస్తామని కలెక్టర్ అన్నారు. 1జనవరి 2024 నాటికి 18 సంవత్సరాలు నిండి ఓటరు జాబితాలో పేర్లు లేకుంటే వెంటనే నమోదు చేసుకోవాలని తెలిపారు.

నియోజక వర్గాల వారీగా ఓటర్లు..

- వరంగల్ తూర్పు నియోజక వర్గంలో 2,56,507 ఓటర్లు ఉండగా ఇందులో 230 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. వీరిలో పురుషులు 1,24,733 ఉండగా మహిళలు 1,31,435, ఇతరులు 339 ఉన్నారు.
- వర్ధన్నపేట నియోజకవర్గంలో మొత్తం 2,72,078 ఓటర్లు కాగా 278 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో పురుషులు 1,33,541 ఉండగా మహిళలు 1,38,520 కాగా ఇతరులు 17 ఉన్నారు.
- నర్సంపేట నియోజక వర్గంలో మొత్తం 2,35,004 ఓటర్లు కాగా 283 పోలింగ్ స్టేషన్లు ఉన్నాయి. ఇందులో పురుషులు 1,14,971 ఉండగా మహిళలు 1,20,024, ఇతరులు 9 మంది ఉన్నారు.

లిఫ్ట్ ఇచ్చి బాలికపై అత్యాచారయత్నం..

చెన్నారావుపేట, ఫిబ్రవరి 8: పాఠశాలకు వెళ్లేందుకు విద్యార్థిని బైక్ లిఫ్టు అడగగా, కొద్దిదూరం వెళ్లాక బాలికపై అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని ఓ గ్రామంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం. చెన్నారావుపేట మండలంలోని ఓ గ్రామంలో బాలిక(14) తొమ్మిదో తరగతి చదువుతోంది. తండ్రి గతంలోనే మృతిచెందగా, తల్లి కూలిపని చేసుకుంటోంది. ఇదిలాఉండగా, తండ్రి మరణ తర్వాత మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం ఓ గ్రామానికి చెందిన తన అమ్మమ్మ ఇంటి వద్ద ఉంటూ స్కూల్‌కు వెళ్తోంది. రోజులా గురువారం ఉదయం అమ్మమ్మ ఇంటి నుంచి పాఠశాలకు బయలు దేరింది. రోజూ బస్సు, లేదంటే ఆటోలో వెళ్లే బా లిక స్కూల్‌కు ఆలస్యమవుతుండడంతో అటుగా వచ్చే యువకుడి బైక్‌పై లిఫ్టు అడిగింది. దీంతోఅతడు లిఫ్టు ఇచ్చా డు. బోజేర్వు గ్రామ సమీపంలోకి రాగానే ఆ యువకుడు బైక్ ఆపి బాలికపై అత్యాచారయత్నం చేయగా బాలిక కేక లు వేస్తూ అక్కడి నుంచి తప్పించుకుంది. జరిగిన విషయాన్ని కుటుంబ సభ్యులకు చెప్పింది. కుటుంబ సభ్యులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా అత్యాచా రయత్నం తమ దృష్టికి వచ్చిందని, ఇంకా కేసు నమోదు చేయలేదని, విచారణ జరిపి త్వరలోనే వివరాలు వెల్లడి స్తామని పేర్కొన్నారు.



సీఎం రేవంత్ రెడ్డితో మంత్రి కొండా సురేఖ | అసెంబ్లీకి వస్తున్న ఎమ్మెల్యేలు దొంతి మాధవరెడ్డి, రేవూరి ప్రకాష్‌రెడ్డి | ఎమ్మెల్సీ బస్వారాజు సారయ్య, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

గురువారం అసెంబ్లీ బడ్జెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి జిల్లాకు చెందిన మంత్రి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ పాల్గొన్నారు.

ఎంజీఎంలో చికిత్స కేంద్రం ప్రారంభోత్సవం

చికిత్సతో మాదక ద్రవ్యాల బాధితులు ఉత్తములుగా మారాలి: కలెక్టర్ ప్రావీణ్య, సీపీ అంబర్ కిషోర్ ఝా



ఎంజీఎంలో ప్రతిజ్ఞ చేస్తున్న సీపీ, కలెక్టర్, అధికారులు



ఏనుమాముల మార్కెట్‌లో ఈవీఎంలోను పరిశీలిస్తున్న కలెక్టర్

హనుమకొండ అర్బన్, ఫిబ్రవరి 8: మత్తు పదార్థాలకు బానిసలైన వారు ముందుకొచ్చి చికిత్స పొంది ఉత్తమ పౌరులుగా బయటకు వచ్చి సమాజంలో మంచి గుర్తింపు పొందాలని వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ఆకాంక్షించారు. గురువారం దేశవ్యాప్తంగా 41 మద్యం, మాదక ద్రవ్యాల చికిత్స కేంద్రాలను కేంద్ర మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్ర కుమార్ వర్చువల్ విధానంలో ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో ఈ కేంద్ర ప్రారంభోత్సవ కార్యక్రమానికి పోలీసు కమిషనర్ అంబర్ కిశోర్‌ఝా, వరంగల్ కలెక్టర్ ప్రావీణ్య ముఖ్య అతిథులుగా విచ్చేసి 50 పడకలతో ఏర్పాటు చేసిన ప్రత్యేక చికిత్స కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ఈ కేంద్రం ద్వారా మత్తు పదార్థాలకు బానిసలై బాధితులకు చికిత్స అందించనున్నారని తెలిపారు. డ్రగ్స్, ఆల్కహాల్, పొగాకుకు బానిసలైన వారు ఈ సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ వార్డులో 2,100 మందికి చికిత్స అందించినట్లు వెల్లడించారు. మత్తు పదార్థాలకు బానిసలైన చాలా కుటుంబాలు చికిత్స తీసుకోవడానికి ముందుకు రావడం లేదని, సంకోచిస్తున్నారని తెలిపారు. జిల్లా సంక్షేమశాఖ, మెప్మా, స్వయం సహాయక సంఘాల సహకారంతో వారికి అవగాహన కల్పించనున్నట్లు వెల్లడించారు. సీపీ అంబర్ కిశోర్ ఝా మాట్లాడుతూ.. గతంలో తాను జిల్లాలో ఎస్పీగా పనిచేసిన సమయంలో గుడుంబా సమస్య ఉండేదని, ఇప్పుడు ఆ సమస్య తగ్గినా యువత గంజాయికి అలవాటు పడి బానిసలుగా మారుతున్నారని అన్నారు. అంతకు ముందు దేవాదాయ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ పంపిన సందేశాన్ని ఎంజీఎం సూపరింటెం డెంట్ చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి శారద, కేఎంసీ ప్రిన్సిపాల్ డాక్టర్ మోహన్‌దాస్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ప్రతీ ఈవీఎంను పరిశీలించాలి: కలెక్టర్

వరంగల్ కలెక్టరేట్ : ప్రతీ ఈవీఎంను అధికారులు క్షుణ్ణంగా పరిశీలించాలని కలెక్టర్ పి.ప్రావీణ్య ఆదేశించారు. గురువారం ఏనుమాముల మార్కెట్ యార్డులో ఈవీఎం గోదాంలో వివిధ రాజకీయ పార్టీల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్లతో కొనసాగుతున్న ఈవీఎంల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియను కలెక్టర్ పరిశీలించి సమర్థ నిర్వహణకు పలు సూచనలు చేశారు. కలెక్టర్‌తోపాటు ఆర్డీవో వాసుచంద్ర, ఎన్నికల పర్యవేక్షకులు విశ్వనారాయణ, తహసీల్దార్లు, ఉప తహసీల్దార్లు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

మహాలక్ష్మి పథకం అమలుకు సిద్ధం కావాలి

గీసుగొండ : తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆరు గ్యారంటీ స్కీంలలో భాగంగా మహాలక్ష్మి పథకం అమలుకు సన్నద్ధం కావాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. బొడ్డుచింతలపల్లిలో చేపట్టిన ప్రత్యేక పారిశుధ్య పనులను గురువారం ఆమె పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజాపాలనలో గృహలక్ష్మి లబ్ధిదారులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేక టీంలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. నర్సరీలో మొక్కల పెంపకాన్ని వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి కటకం కల్పన, మండల స్పెషల్ ఆఫీసర్ దేవేందర్, ఎంపీడీవో వీరేశం, తహసీల్దార్ రియాజుద్దిన్, ఎంపీవో ఆడెపు ప్రభాకర్, ఆర్ఐ సాంబయ్య, కార్యదర్శి యాకలక్ష్మి పాల్గొన్నారు.

మార్కెట్‌కు మూడు రోజులు సెలవులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 8: ఏనుమాముల వ్యవసాయ మార్కెట్ మూడురోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం అమావాస్య మార్కెట్‌కు సెలవు, శనివారం వారంతపు యార్డు సెలవు, ఆదివారం సాధారణ సెలవు ఉందన్నారు. సోమవారం నుంచి క్రయవిక్రయాలు యథావిధిగా సాగుతాయన్నారు.

సెలవులో బల్దియా కమిషనర్

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 8: వరంగల్ మహానగర పాలక సంస్థ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా 15 రోజుల సెలవులో వెళ్లారు. వ్యక్తిగత పనులతో ఆయన ఈనెల 8 నుంచి 22వ తేదీ వరకు సెలవు పెట్టారు. హనుమకొండజిల్లా అడిషనల్ కలెక్టరు రాధిక గుప్తాకు ఇన్‌చార్జి బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి శాంతికుమారి ఉత్తర్వులు జారీ చేశారు.

పైసలు కొట్టే... పోస్టు పట్టే!



- ఒక్కో పోస్టుకు రూ.5లక్షల నుంచి రూ.30లక్షలు
- పలువురు నేతలు బేరసారాలు
- సీఎం రేవంత్‌రెడ్డికి చేరిన ఇంటెలిజెన్స్ నివేదిక

7



ఢిల్లీలో జరిగిన స్మార్ట్‌సిటీ చాలెంజ్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా

స్మార్ట్‌సిటీ చాలెంజ్‌లో కమిషనర్ ప్రజంటేషన్

- జ్యూరీ ఇంటర్వ్యూలకు ఎంపికపై ఉత్కంఠ
- ఎంపికైతే నగరానికి రూ.135 కోట్లు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 8: ఢిల్లీలోని నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అర్బన్ ఎఫైర్స్‌లో నిర్వహించిన సిటీ ఇన్వెస్ట్‌మెంట్ టూ ఇన్నోవేటివ్ అండ్ సస్టైన్ (సీఐటీఐఐఎస్) స్మార్ట్‌సిటీ 2.0 చాలెంజ్ జరిగింది. తొలి దశలో ఎంపికైన దేశంలోని 84 నగరాలు చాలెంజ్‌లో పాల్గొన్నాయి. కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండ్ అర్బన్ ఎఫైర్స్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో గురువారం జరిగిన ఛాలెంజ్‌లో జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా పాల్గొని వరంగల్ స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌పై ప్రజెంటేషన్ ఇచ్చారు. స్మార్ట్‌సిటీ కింద చేపట్టిన పలు అభివృద్ధి పనులు, మారిన నగర రూపురేఖలు, భవిష్యత్తులో నగర అభివృద్ధి తదితర అంశాలను వివరించారు. రాష్ట్రంలో వరంగల్ రెండో అతిపెద్ద నగరం, చారిత్రక నేపథ్యం, హైదరాబాద్ తరువాత అభివృద్ధి చెందుతున్న తీరు, స్మార్ట్‌సిటీ చాలెంజ్‌కు ఎంపికైన వివరాలను కమిషనర్ ప్రజెంట్ చేశారు. సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, పారిశుధ్య నిర్వహణ, బయో మైనింగ్, ఎఫ్ఎస్‌టీ, ఎస్‌టీపీల నిర్మాణంలో వరంగల్ నగరం ఇతర దేశాలకే ఆదర్శంగా నిలిచిన పరిణామాలను తెలియచేశారు. ఈ పోటీలో కమిషనర్‌తో పాటు వరంగల్ జిల్లా అదనపు కలెక్టర్ అశ్విని తానాజీ, బల్దియా సీఎంహెచ్‌వో డాక్టరు రాజేశ్ పాల్గొన్నారు.

ఎంపికైతే భారీగా అభివృద్ధి నిధులు

తొలి దశలో ఎంపికైన 84 నగరాలు ఢిల్లీలో జరిగిన చాలెంజ్‌లో పాల్గొనగా వీటినుంచి 18నగరాలను జ్యూరీ ఇంటర్వ్యూలకు కేంద్ర మినిస్ట్రీ ఆఫ్ హౌసింగ్ అండర్ అర్బన్ ఎఫైర్స్ ఎంపిక చేస్తుంది. త్వరలో ఈ వివరాలను వెల్లడిస్తారు. 18నగరాల్లో వరంగల్ నగరం ఒకటిగా ఎంపికైతే కేంద్రం రూ.135 కోట్లను నగరాభివృద్ధి కోసం విడుదల చేస్తుంది. ఈక్రమంలో జ్యూరీ ఇంటర్వ్యూ, నగర ఎంపిక అంశాలపై ఉత్కంఠ నెలకొంది. నగరం తప్పక ఎంపికవుతుందనే ఆశాభావాన్ని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా వ్యక్తం చేశారు.



కిషన్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరిన అభినవ్ భాస్కర్

బీజేపీలో చేరిన అభినవ్‌భాస్కర్

పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

హనుమకొండ టౌన్, ఫిబ్రవరి 8: బీఆర్ఎస్‌కు రాజీనామా చేసిన 60వ డివిజన్ కార్పొరేటర్, మాజీ మంత్రి దాస్యం ప్రణయ్ భాస్కర్ తనయుడు దాస్యం అభినవ్ భాస్కర్ బీజేపీలో చేరారు. గురువారం ఢిల్లీలో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు, డి.కె.అరుణ, జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ సమక్షంలో అభినవ్‌భాస్కర్ బీజేపీలో చేరారు. బీజేపీ కండువా కప్పి అభినవ్‌భాస్కర్‌ను కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. బీజేపీలో చేరిన అభినవ్‌భాస్కర్ ఆ పార్టీ జాతీయ నేతలు బీ.ఎల్.సంతోష్, సునీల్ బన్సల్, తరుణ్‌చుగ్, ఎంపీ అరవింద్, చంద్రశేఖర్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా అభినవ్ భాస్కర్ పార్టీ మారడం, బీజేపీలో చేరడం వెనుక ఆ పార్టీ జాతీయ నేత ఈటల రాజేందర్ చక్రం తిప్పినట్లు సమాచారం. ప్రస్తుతం పార్టీలో సముచిత స్థానం కల్పించడంతో పాటు వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలో నిలిచే అవకాశం ఇస్తామనే హామీ బీజేపీ నుంచి తీసుకుని అభినవ్‌భాస్కర్ పార్టీ మారినట్లు పార్టీ వర్గాల సమాచారం.

రుణం వస్తుందని నమ్మించి మోసం

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 8: ఫేస్‌బుక్‌లో పరిచయమై లోన్ వస్తుందని చెప్పడంతో నమ్మి మోసపోయిన ఘటన హనుమకొండ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హనుమకొండ మచిలీబజర్‌కు చెందిన షేక్ మంజోర్‌లహిర్ అనే వ్యక్తికి ఇటీవల ఫేస్‌బుక్‌లో గుర్తి తెలియని వ్యక్తి పరిచయమయ్యాడు. ఎలాంటి ఆధారాలు లేకుండానే లోన్ వస్తుందని చెప్పడంతో నమ్మి ఇంకా పరిచయం పెంచుకున్నాడు. ముందుగా ధన్‌లోన్ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని గుర్తు తెలియని వ్యక్తి నమ్మించాడు. పూర్తి వివరాలు కావాలని కోరడంతో ఆధార్ కార్డు, ఫొటోలు పంపించాడు. లోన్ పొందాలంటే ముందుగా ప్రాసెసింగ్ ఫీజు చెల్లించాలని క్యూఆర్ కోడ్‌ను పంపించాడు. స్కాన్ చేయడంతో బ్యాంకు నుంచి రూ.25వేల నగదు డ్రా అయినట్టు గుర్తించాడు. 1930 ఫోన్ చేసి ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు వెల్లడించారు.

ఉద్యోగం పేరుతో రూ.1.18 లక్షలకు టోకరా

హనుమకొండ క్రైం, ఫిబ్రవరి 8: ఆన్‌లైన్‌లో కార్లు బుక్ చేస్తే కమీషన్ దండిగా వస్తుందని చెప్పడంతో ఒకరు నమ్మి మోసపోయిన ఘటన హనుమకొండ రెడ్డికాలనీలో చోటు చేసుకుంది. హనుమకొండ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రెడ్డికాలనికి చెందిన పిల్లలమర్రి శ్రవన్ అనే వ్యక్తి గూగుల్‌లో వెతుకుతుండగా పార్ట్‌టైమ్ జాబ్ అని వచ్చింది. దీనిలో వెతకగా ఒక కంపెనీలో ఉద్యోగం ఖాళీగా ఉందని, ప్రతీరోజు సెల్‌ఫోన్‌లో కార్లు బుక్ చేస్తే నెలకు సరిపడా డబ్బులు వస్తాయని చాటింగ్ ద్వారా తెలుసుకున్నాడు. వారు ఆన్‌లైన్‌లో శ్రవన్‌కు గుర్తింపు కార్డు జారీ చేసి రోజుకు 30 కార్లు బుక్ చేయాలని చెప్పారు. దీంతో రోజుకు 30 కార్లు వారు పంపిన ఫేక్ అడ్రస్‌లకు బుక్ చేస్తున్నాడు. కమీషన్ డబ్బులు ఇవ్వాలని శ్రవన్ కోరడంతో డబ్బులు పొందేందుకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి తీసుకోవాలని చెప్పారు. వారు చెప్పిన ప్రకారం స్కాన్ చేయడంతో ముందుగా రూ.10వేలు శ్రవన్ బ్యాంకు నుంచి డ్రా అయ్యాయి. ఇదేమిటని వారిని ప్రశ్నించడంతో పంపించిన డబ్బులు రావాలంటే మరో రూ.25వేలు పంపించాలని సూచించారు. ఇలా రూ.1.18లక్షల వరకు లాగేశారు. మోసపోయినట్టు గుర్తించిన శ్రవన్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు.



ముందస్తు మొక్కుల జోరు

మేడారంలో రద్దీగా సమ్మక్క, సారలమ్మల గద్దెలు

మేడారం, ఫిబ్రవరి 8: తాడ్వాయి మండలంలోని మేడారం సమ్మక్క, సారలమ్మల సన్నిధి భక్తులతో సందడిగా మారింది. వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు భారీగా గురువారం తరలివచ్చి వనదేవతలకు ముందస్తు మొక్కులు చెల్లించుకున్నారు. మహా జాతర నేపథ్యంలో కుటుంబ సమేతంగా, బంధుమిత్రులతో కలిసి మేడారం చేరుకున్నారు. ఆదివాసీ సంప్రదాయం ప్రకారం జంపన్నవాగులో పుణ్యస్నానాలు ఆచరించి కల్యాణ కట్టలో తల నీలాలు సమర్పించారు. దేవాదాయ శాఖ ఏర్పాటు చేసిన క్యూలైన్ల ద్వారా తల్లుల వద్దకు చేరుకున్నారు. నేరుగా గద్దెలను దర్శించుకొని పూలు, పండ్లు, పసుపు కుంకుమ, కొబ్బరికాయలు, బెల్లం చీర సారెలు సమర్పించుకున్నారు. చల్లంగా చూడాలని కోరుతూ యాట మొక్కులు చెల్లించారు. అనంతరం మేడారం పరిసరాల్లోని చెట్ల కింద విడిది చేసి కుటుంబ సమేతంగా విందుభోజనాలు చేశారు. కాగా, సుమారు లక్షకు పైగా భక్తులు మేడారం అమ్మవార్లను దర్శించుకున్నారని కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తెలిపారు. అలాగే జాతీయ మిర్చి టాస్క్‌ఫోర్స్ డైరక్టర్ నాసిరెడ్డి సాంబశివరెడ్డి కుటుంబ సమేతంగా సమ్మక్క, సారలమ్మలను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ కుంభమేళాగా ప్రసిద్ధి చెందుతున్న మేడారం సమ్మక్క, సారలమ్మలకు కేరళ రాష్ట్రం నుంచి ప్రత్యేకంగా తయారు చేయించిన చందన మాలలు, సుగంధ హారాలు, పట్టు వస్త్రాలను మహా జాతర వేడుకలకు బహూకరిస్తానని చెప్పారు. తల్లులకు పట్టు వస్త్రాలు అందజేసే భాగ్యం తనకు కలగడం సంతోషంగా ఉందన్నారు.

స్నానఘట్టాల వద్ద పుణ్యస్నానాలు చేయాలి

మేడారం మహాజాతరకు తరలివస్తున్న భక్తులు జంపన్నవాగులో ఉన్న స్నానఘట్టాల వద్ద ఏర్పాటు చేసిన షవర్ల కింద పుణ్యస్నానాలు ఆచరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి సూచించారు. చింతల్ క్రాస్ రోడ్డు నుంచి రెడ్డిగూడెం కాజ్‌వే వరకు వాగు ప్రమాద స్థాయిలో ఉందన్నారు. భక్తులు మేడారం జంట వంతెనలకు ఇరువైపులా ఏర్పాటు చేసిన స్నానఘట్టాలపై మాత్రమే పుణ్యస్నానాలు ఆచరించాలని అన్నారు.



వనదేవతలను దర్శించుకునేందుకు వస్తున్న శివసత్తులు



జంపన్నవాగు వద్ద పుణ్యస్నానాలు ఆచరిస్తున్న భక్తులు

బస్సులు లేక భక్తుల అవస్థలు

సమ్మక్క, సారలమ్మలను దర్శించుకోవడానికి తరలివచ్చిన భక్తులకు సరిపడా బస్సులు లేకపోవడంతో గురువారం అవస్థలు పడ్డారు. మహాజాతరకు ముందుగా మేడారంలో తల్లుల గద్దెలకు మొక్కులు చెల్లించుకోవడానికి దూర ప్రాంతాల నుంచి ఆర్టీసీ బస్సుల్లో తరలివచ్చిన భక్తులు దర్శనాల అనంతరం తిరిగి వెళ్లడానికి బస్సులు లేక మూడు గంటలకు పైగా వేచి చూస్తున్నామని ఆందోళన చెందారు. వేల సంఖ్యలో భక్తులు బస్సు సౌకర్యాలను ఉపయోగించుకుంటున్నారు. ఈ క్రమంలో భక్తులకు సరిపడా బస్సు సర్వీసులను ఆర్టీసీ అధికారులు నడపడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భక్తులు ఉదయం మేడారం వచ్చి తల్లులను దర్శించుకొని పరిసర ప్రాంతాల్లో విడిది చేస్తున్నారు. సాయంత్రం తిరిగి వెళ్లడానికి గంటల వ్యవధి పడుతోందన్నారు.



కుక్కకు తులాభారం వేస్తున్న దృశ్యం

కుక్కకు నిలువెత్తు బంగారం

హైదరాబాద్‌కు చెందిన పోశాల జ్యోతి-భిక్షపతి దంపతులు తమ పెంపుడు కుక్క లియో నిలువెత్తు బంగారం(బెల్లం)ను వనదేవతలకు సమర్పించారు. కుక్క అనారోగ్యం బారిన పడినప్పుడు మొక్కుకున్నామని తెలిపారు. ఈ క్రమంలోనే కుక్కతో పాటుగా తల్లులను దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నామన్నారు.



గద్దెల ప్రాంగణంలో బూట్లు వేసుకుని నిర్వరిస్తున్న పోలీసు

గద్దెల ప్రాంగణంలోకి బూట్లతో పోలీసు..

మేడారం వనదేవతల సన్నిధిలో విధులు నిర్వహిస్తున్న ఓ పోలీసు అధికారి బూట్లతో గురువారం గద్దెల ప్రాంగణంలోకి వెళ్లి భక్తుల దర్శనాలను పరిశీంచారు. ఈ క్రమంలో ఆ అధికారిని గమనించిన వీఆర్‌ఏ రాంబాబు బయటకు తీసుకువచ్చారు. విధులు నిర్వహిస్తే సంప్రదాయాలు పాటించాల్సిన అవసరం లేదా.. అని భక్తులు ప్రశ్నిస్తున్నారు. పోలీసు అధికారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ములుగు కలెక్టర్ ఇలా త్రిపాఠి

గిరిజన సంప్రదాయంతో జాతర నిర్వహిస్తాం..

అధికారుల సమావేశంలో ములుగు జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి

మేడారం, ఫిబ్రవరి 8: మేడారం మహాజాతరను గిరిజన సంప్రదాయంతో అత్యంత వైభవంగా నిర్వహిస్తామని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలోని హరిత హోటల్‌లో గురువారం తహసీల్దార్ రవీందర్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. గిరిజన సంప్రదాయాల ప్రకారం మేడారం సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజుల మహాజాతరను ఫిబ్రవరి 21 నుంచి నాలుగు రోజుల పాటు వైభవంగా నిర్వహిస్తామని తెలిపారు. కోటిన్నరకు పైగా భక్తులు తరలివచ్చి వనదేవతలకు మొక్కులు చెల్లించుకుంటారన్నారు. ఇందులో భాగంగానే భక్తులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ప్రతి భక్తుడు, భక్తురాలు అమ్మవార్లను సులువుగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేస్తామన్నారు. ప్రత్యేక పారిశుధ్య ఏర్పాట్ల కోసం మేడారం పరిసరాలను 10 సెక్టార్లుగా విభజించి 35 జోన్లుగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. గతంలో ఉన్న నాలుగు డంపింగ్ యార్డులు కాకుండా మరో ఆరింటిని నూతనంగా ఏర్పాటు చేశామన్నారు. జాతరలో నిరంతరం పారిశుధ్య పనులు జరిగేలా పనులు చేపడుతామని పేర్కొన్నారు. 4వేల మంది కార్మికులను అందుబాటులో ఉంచామన్నారు. వీరితో పాటుగా ఐటీసీ, సింగరేణి, ఎన్‌టీపీసీ సంస్థల ద్వారా ఏర్పాటు చేసిన ప్రత్యేక యంత్రాలతోనూ పారిశుధ్య పనులు కొనసాగుతాయని చెప్పారు. జంతు వ్యర్థాలు, మరుగుదొడ్ల నిర్వహణకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. మహా జాతరలో సెప్టిక్ ట్యాంకుల నుంచి వ్యర్థాలను తొలగించడానికి గల్పర్స్ సంఖ్యను పెంచామని తెలిపారు. ఆర్‌డబ్ల్యూఎస్ శాఖ ఆధ్వర్యంలో 14 క్లస్టర్లుగా విభజించామన్నారు. 5,532 మరుగుదొడ్లను 279 యూనిట్స్‌గా ఒక్కో యూనిట్‌కు 20 మరుగుదొడ్లు ఉండేలా ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. భక్తులకు 230 చేతి పంపులను అందుబాటులో ఉంచామని తెలిపారు. క్యూలైన్లలో భక్తులకు జాతర రోజుల్లో నిరంతరం తాగునీరు అందించేలా 50 లీటర్ల వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ ఇలా త్రిపాఠి పేర్కొన్నారు. చలువ పందిళ్లు నిర్మిస్తున్నామని అన్నారు. ఇరిగేషన్ శాఖ ఆధ్వర్యంలో జంపన్నవాగు లోతట్టు, రద్దీ ప్రాంతాలలో గజ ఈతగాళ్లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. వాగులో జాతర సమయానికి మూడు నుంచి నాలుగు ఫీట్ల నీటిమట్టం ఉండేలా ఫిబ్రవరి 14 నుంచి 16వ తేదీ వరకు లక్నవరం సరస్సు నుంచి నీటిని విడుదల చేయడం జరుగుతుందన్నారు. వైద్యశాఖ నుంచి మేడారం పరిసరాల్లో 30 తాత్కాలిక వైద్య శిబిరాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. అంబులెన్స్ అందుబాటులో ఉంటుందన్నారు. ఆర్టీసీ మహిళా సిబ్బందికి టికెట్ కౌంటర్స్ వద్ద ప్రత్యేక వసతి సదుపాయాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. జతరకు వచ్చే భక్తులకు 6వేల బస్సులు అందుబాటులో ఉంటాయన్నారు.

జిల్లా ఎస్పీ శబరీష్ మాట్లాడుతూ.. పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు జాతరలో 14వేల మంది పోలీసు సిబ్బంది విధులు నిర్వహిస్తారని అన్నారు. ప్రత్యేక ప్రణాళికల ద్వారా ట్రాఫిక్ క్రైమ్ భక్తుల రద్దీ కంట్రోల్ చేయడం జరుగుతుందన్నారు. వనదేవతలను గద్దెలకు తీసుకువచ్చే క్రమంలో భక్తుల రద్దీ అధికంగా ఉంటుందని రోప్ పార్టీల ద్వారా దేవతల ప్రతిష్ఠకు భంగం కలుగకుండా క్రౌడ్ కంట్రోల్ చేయడానికి ప్రత్యేక టెక్నాలజీ ఉపయోగిస్తున్నట్లు తెలిపారు. జాతర పరిసరాల్లో 500 సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. కమాండ్ కంట్రోల్ రూమ్ ద్వారా వీఐపీ, వీవీఐపీల దర్శనాల వలన సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చూస్తామని అన్నారు. మహా జాతరకు 23వ తేదీన ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి వచ్చే అవకాశం ఉన్నందున పటిష్ఠ భద్రత ఏర్పాట్లను చేస్తున్నామన్నారు. సమావేశంలో ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెక్టర్ శ్రీజ, ఏటూరునాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, మేడారం కార్యనిర్వహణ అధికారి రాజేంద్రం తదితరులు పాల్గొన్నారు.

నిర్వహణ బహుదూరం!

(5వ పేజీ తరువాయి)

చర్చించాలన్నా వారు మేడారం నుంచి వరంగల్‌లో వ్యయ ప్రయాసాలకు ఓర్చి రావలసిందే. ప్రధాన జాతర సమయంలో నాలుగు రోజుల పాటు దేవాదాయశాఖ అధికారులు మేడారంలో స్థానికంగా అందుబాటులో ఉన్నా మిగతా రోజులు ఇక్కడ హనుమకొండలో తిష్టవేసి ఉంటారు. హుండీల లెక్కింపు, వాటాల పంపకం తదితర వ్యవహారాలన్నీ హనుమకొండ కేంద్రంగా సాగుతుంటాయి. వీటి పరిశీలన, పర్యవేక్షణకు పూజారులు, పూజారుల సంఘం నాయకులు ప్రతీసారి మేడారం నుంచి వరంగల్‌కు రావలసి వస్తోంది. అదే అన్నిహంగులతో కూడిన ఈవో కార్యాలయాన్ని మేడారంలోని జాతర ప్రాంగణంలో ఏర్పాటు చేస్తే ఈ ఇబ్బందులు ఉండవన్న అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

వాచ్‌టవర్ కింద..

మేడారంలో ప్రస్తుతం ఈవో కార్యాలయం తల్లుల గద్దెల వద్ద వాచ్‌టవర్ కింద చిన్న ఇరుకు గదిలో ఉంది. ఇందులో ఒక టేబుల్, ఒక కుర్చీ, ఒకరు లేదా ఉద్యోగులు మాత్రమే కూర్చునే వీలున్నది. ఇక్కడ ఈవో ఆఫీసు ఉందన్న విషయంలో చాలా మందికి తెలియదు. ఇంత పెద్ద జాతరకు సంబంధించిన దేవాదాయ శాఖ ఆఫీసు ఇంత చిన్న గదిలో కొనసాగడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. మారుమూల అటవీ ప్రాంతమైన మేడారంలో ఉండడానికి దేవాదాయ శాఖ అధికారులు, సిబ్బంది పెద్దగా ఇష్టపడడం లేదు. వరంగల్ నగరంలో ఉండడానికి అలవాటుపడ్డ అధికారులు, ఉద్యోగులు మేడారంలో విధుల నిర్వహణను శిక్షగా భావిస్తుంటారు. ఇక్కడ డ్యూటీ పడిన ప్రతీ రోజు అప్‌అండ్‌డౌన్ చేస్తుంటారు. మేడారంలో జాతర సందర్భంలో తప్ప మిగతా సమయంలో సిబ్బంది పెద్దగా ఉండరు. ఒకరిద్దరు ఉద్యోగులు తప్ప ఎవరూ కనపడరు. ఇక్కడ శాశ్వత ప్రాతిపదికపై పూర్తిస్థాయిలో ఈవో ఆఫీసును ఏర్పాటు చేస్తే ఇక్కడే ఉండాల్సి వస్తుందన్న కారణంతో ఇక్కడ కార్యాలయం లేకుండా చాలాకాలంగా అధికారులు అడ్డుపడుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. కార్యాలయ భవనం లేకపోవడంతో ప్రధాన జాతర జరిగే సమయంలో దేవాదాయ శాఖ ఉన్నతాధికారులు, సిబ్బంది ఐటీడీఏ గెస్ట్‌హౌస్‌లో లేదా తాత్కాలికంగా వేసిన గుడారాల్లో ఉంటారు.

ధార్మిక భవన్‌కు మేడారం నిధులు

పాత సెంట్రల్ జైలుకు ఎదురుగా ప్రభుత్వం కేటాయించిన స్థలంలో ధార్మిక భవన్ పేరుతో రూ.3కోట్ల వ్యయంతో భవనాన్ని నిర్మించారు. ఈ మూడు కోట్లలో భద్రకాళి దేవస్థానం నుంచి రూ.కోటి, మడికొండలోని మెట్టురామలింగేశ్వరాలయం దేవస్థానం నుంచి రూ.కోటితోపాటు మేడారం సమ్మక్క సారలమ్మ జాతర ఆదాయం నుంచి మరో రూ.కోటిని వాడుకున్నారు. ఇటీవల వరకు దేవాదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్, మేడారం ఈవో కార్యాలయాలు హనుమకొండ అద్దె భవనంలో కొనసాగుతుండేవి. ధార్మిక భవనం నిర్మాణమైన తర్వాత ఇందులోకి మారాయి. వాస్తవానికి ఈ భవన నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు కేటాయించాల్సి ఉంది. కానీ స్థానిక దేవాలయాల నిధులనువాడుకున్నారు. మేడారంలో ఉండాల్సిన ఈవో కార్యాలయాన్ని పట్టించుకోకుండా ఆజాతర నిధులను మాత్రం ఇక్కడ ఎట్లా వినియోగిస్తారని పూజారులు, భక్తులు నిలదీస్తున్నారు. ధార్మిక భవనం నిర్మాణానికి సమ్మక్క సాలరమ్మ జాతర నిధుల నుంచి తీసుకున్న రూ.కోటి నిధులతో మేడారంలోనే ఆధునాతనమైన అన్ని హంగులతో విశాలమైన ఈవో కార్యాలయాన్ని నిర్మించవచ్చు. అదేం పట్టించుకోకుండా ధార్మిక భవనానికి వాడుకొని అందులోనే ఒక భాగంలో మేడారం ఈవో ఆఫీసుకు చోటు కల్పించారు.

ఎప్పటి నుంచే డిమాండ్

వరంగల్‌లోని మేడారం ఈవో కార్యాలయాన్ని మేడారానికి తరలించాలన్న డిమాండ్ ఎప్పటి నుంచో ఉంది. జాతర జరిగిన ప్రతీసారి ఈ డిమాండ్ తెరమీదికి వస్తున్నా.. ఎవరూ పట్టించుకోవడం లేదు. మేడారం ఒక దర్శనీయ స్థలంగానే కాక ప్రముఖ పర్యాటక ప్రాంతంగా కూడా భాసిల్లుతోంది. ఈ దృష్ట్యా అక్కడ భక్తులు బస చేయడానికి శాశ్వత ప్రాతిపదికపై వసతి సౌకర్యాలను కల్పించాల్సి ఉన్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. గద్దెల సమీపంలో పది గదులతో ఒక భవనాన్ని నిర్మించినప్పటికీ నిర్వహణలేక దాని పరిస్థితి అస్థవ్యస్తంగా మారింది. గద్దెల వద్ద దేవాదాయం ఉద్యోగులను నియమించినా వారికి నిలువ నీడ, కూర్చోవడానికి కుర్చీలు కూడా లేవు. అదే పూర్తిస్థాయిలో ఈవో కార్యాలయాన్ని నిర్మించినట్లయితే భక్తుల సౌకర్యాలను నిరంతరం పర్యవేక్షించేందుకు,అవసరమైన ఏర్పాట్లు ఎప్పటికప్పుడు చేయడానికి వీలుంటుందని పూజారులు అభిప్రాయపడుతున్నారు.

మేడారంలో ఈవో ఆఫీసు ఏర్పాటు చేయాలి..

సిద్దబోయిన జగ్గారావు, మేడారం పూజారుల సంఘం అధ్యక్షుడు



మేడారం సమ్మక్క - సారలమ్మ జాతర ప్రాశస్త్యం రోజురోజుకూ పెరుగుతోంది. జాతర ప్రపంచ వ్యాప్తంగా ఖ్యాతిని గడిస్తోంది. రెండేళ్లకోసారి ఈ జారతకు కోటి మందికి పైగా భక్తులు వస్తుంటారు. ఇంత పెద్ద జాతరకు మేడారంలో ఈవో కార్యాలయం లేకపోవడం విడ్డూరం. దీని కార్యాలయాన్ని హనుమకొండలో ఏర్పాటు చేయడం మరీ దారుణం. ప్రతీ చిన్న విషయానికి 130 కి.మీ. దూరంలో ఉన్న ఈ కార్యాలయానికి పూజారులు ఎన్నో వ్యయప్రయాసాలకు ఓర్చి వెళ్లాల్సి వస్తోంది. ఇప్పుడు జాతర నిరంతరం జరుగుతోంది. కనుక ఇప్పటికైనా ఈవో కార్యాలయాన్ని మేడారానికి తరలించాలి. అన్ని హంగులతో కూడిన భవనంలో ఏర్పాటు చేయాలి. అందరికీ అందుబాటులో ఉండేలా చూడాలి.

భక్తులకు అసౌకర్యం కలగనీయం

● రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క ● మేడారంలో రాత్రివేళ జాతర పనుల పరిశీలన

మేడారం, ఫిబ్రవరి 8: మేడారం సమ్మక్క, సారలమ్మ జాతరకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగనీయమని, అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క అన్నారు. గురువారం రాత్రి 7.30 గంటల సమయంలో మంత్రి మేడారం వచ్చారు. వనదేవతల గద్దెల పరిసరాల్లో ఏర్పాట్లను పరిశీలించారు. క్యూలైన్‌లు, చలువ పందిళ్లు, లైటింగ్ పనులను జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠిని అడిగి తెలుసుకున్నారు. దర్శనానికి వచ్చిన పలువురు భక్తులతో సీతక్క మాట్లాడారు. ప్రముఖల దర్శనం కోసం ఏర్పాటు చేసిన ప్రత్యేక క్యూలైన్‌ను పరిశీలించారు. స్థానిక పోలీసు కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో జిల్లా అధికారులతో మాట్లాడారు. భక్తులు జాతరకు ముందుగానే లక్షలాదిగా తరలివస్తున్నారని, వారికి సదుపాయాలను అందుబాటులోకి తేవాలన్నారు. ఇప్పుడు కూడా జాతర జరుగుతోందనే విధంగా భక్తులకు ఏ చిన్న అసౌకర్యం కలగనీయవద్దని తెలిపారు. తాగునీరు, పారిశుధ్య చర్యలను వేగవంతం చేయాలని సూచించారు. మరో వారం రోజుల్లో ఏ పనీ మిగిలి ఉండవద్దన్నారు. ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జాతర జరుగుతున్న విషయాన్ని ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ శబరీష్, ఐటీడీఏ పీవో అంకిత్, అదనపు కలెకర్ శ్రీజ, డీఎంహెచ్‌వో అప్పయ్య, డీపీవో వెంకయ్య, పీఆర్ ఈఈ అజయ్‌కుమార్, డీఎస్పీ రవీందర్, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, ఎండోమెంట్ ఈవో రాజేంద్రం, తదితరులు పాల్గొన్నారు.



భక్తులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

పైసలు కొట్టే... పోస్టు పట్టే!

● పోలీసు బదిలీల్లో పొలిటికల్ చేతివాటం ● ఒక్కో పోస్టుకు రూ.5లక్షల నుంచి రూ.30లక్షలు



వరంగల్, ఫిబ్రవరి8 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): పోలీసుల బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారాయా..? వేలం పాటను తలపించేలా సాగిన ఈ కాసుల వ్యవహారంలో పోటాపోటీగా పోస్టులు దక్కించుకున్నారా..? అంటే అవుననే ప్రచారమే జరుగుతోంది. వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో 29మంది ఇన్‌స్పెక్టర్ల బదిలీల్లో రాజకీయ జోక్యం మితిమీరిపోయిందన్న చర్చ జరుగుతోంది. మంత్రితో పాటు ఒకరిద్దరు మినహా మిగతా లీడర్లు పోలీసు పోస్టింగులను వేలం తరహాలో ఎవరు ఎక్కువ ఇస్తే వారికే సిఫారసు లేఖలు ఇచ్చారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇదిలాఉంటే బదిలీల్లో జరిగిన ఈ ముడుపుల బాగోతంపై ఇంటిలిజెన్స్ అధికారులు సీఎంకు ఓ నివేదిక కూడా అందించారన్న సమాచారం పోలీసువర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తరువాత తొలిసారిగా పోలీసు బదిలీలు జరిగాయి. పదేళ్ల అధికారంలోకి రావటంతో తమకు అనుకూలంగా ఉండేవారిని తమ ప్రాంతాల్లో పోస్టింగులు ఇప్పించుకోవడం ఆనవాయితే. అందులో భాగంగా వరంగల్ పోలీసు కమిషనరేట్ పరిధిలో బుధవారం రాత్రి 29మంది సీఐల బదిలీలు జరగ్గా, వారిలో చాలామంది గురువారం విధుల్లో చేరారు. అయితే ఈ బదిలీల్లో భారీగా ముడుపులు చేతులు మారినట్టు ప్రచారం జరుగుతోంది. హనమకొండ జిల్లాలోని నగర శివారులో ఓ పోలీస్‌స్టేషన్ పోస్టును ఏకంగా రూ.30లక్షలు చెల్లించి సొంతం చేసుకున్నట్టు ప్రచారం జరుగుతోంది. అలాగే నగరంలోని ఓ ఎస్‌హెచ్‌వో పోస్టు రూ.25లక్షల ధర పలికింది. ఈ పోస్టుకే మరో అధికారి రూ.20లక్షల వరకు ఇచ్చేందుకు ముందుకు రాగా, మరో పోలీసు అధికారి రూ.25లక్షలు ఇచ్చేందుకు సిద్ధం కావడంతో సదరు అధికారికే సిఫారసు లేఖ ఇచ్చారని, దీంతో పోస్టింగ్ ఆర్డర్ వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. అలాగే జనగామ జిల్లాలో ఓ నియోజకవర్గంలోని పోలీస్‌స్టేషన్‌కు తక్కువగా రూ.5లక్షలే ధర పలకగా, అదే నియోజకవర్గంలోని మరో పోలీస్‌స్టేషన్‌కు ఏకంగా రూ.20లక్షల ముడుపులు చెల్లించి సీటు సంపాదించుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. నగర శివారులోని మరో పోలీసు స్టేషన్ పోస్టుకు కూడా ఏకంగా రూ.15లక్షలు ఫిక్స్ చేసుకొని సిఫార్సు లేఖ ఇవ్వటంతో పోస్టింగ్ ఆర్డర్ వచ్చినట్లుగా ప్రచారం జరుగుతోంది. ఇలా ఒక్కొక్క స్టేషన్‌కు ఒక్కో రేటుకు పోస్టింగులు అమ్ముకున్నారనే ప్రచారం విస్తృతంగా జరుగుతోంది.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓటమికి కృషి చేశారని అనుమానించిన పోలీసు అధికారులకు కూడా తాజా బదిలీల్లో పోస్టింగులు ఇవ్వటం పోలీసువర్గాల్లో విస్తృతంగా చర్చ జరుగుతోంది. జనగామ జిల్లాలో ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొన్న ఓ అధికారికి అదే జిల్లాలో మరో నియోజకవర్గంలో పోస్టింగు ఇవ్వటం చర్చనీయాంశమైంది. ఇక మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న నియోజకవర్గంలో మాత్రం ఇలాంటి బేరసారాలు జరగలేదని, ప్రజల వద్ద పైసలు తీసుకోకుండా పని చేయాలనే నిబంధనలతో ఆ ప్రాంతంలో పోలీసులకు పోస్టింగులు ఇచ్చారన్న చర్చ జరుగుతోంది. తన నియోజకవర్గంతో పాటు మరో రెండు మూడు చోట్ల పోస్టింగులకు సిఫార్సు చేసినట్టు సమాచారం. మరో ఒకరిద్దరు ఎమ్మెల్యేలు కూడా పైసల జోలికి వెళ్లకుండా పోస్టింగులకు సిఫారసు లేఖలు ఇచ్చినట్టు తెలుస్తుండగా.. రూ.లక్షలు వెచ్చించి పోస్టింగులు పొందిన కొంతమంది అధికారులు మళ్లీ ఆ సొమ్మును ఎలా సంపాదిస్తారనే చర్చ ప్రజల్లో జరుగుతోంది. పైసలు ఇచ్చి వచ్చిన అధికారులు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

సీఎంకు ఇంటెలిజెన్స్ నివేదిక

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పోలీసు పోస్టింగుల్లో రాజకీయ జోక్యం మితిమీరి పోయిందనమ్న వ్యవహారంపై సీఎంవో వర్గాలు దృష్టిసారించాయి. బుధవారం 'ఆంధ్రజ్యోతి' సంచికలో 'పోలీస్ పోస్టింగుల్లో పొలిటికల్ వార్' శీర్షికన కథనం ప్రచురితమైన నేపథ్యంలో తమ సిఫార్సులకు ఎక్కడ బ్రేక్ పడుతుందో అనే ఆందోళనతో కొంతమంది లీడర్లు అధికారులపై ఒత్తిడి తెచ్చి రాత్రికి రాత్రే బదిలీతంతు ముగించారనే ప్రచారం జరుగుతోంది. అయితే ఈ బదిలీల్లో భారీగా సొమ్ములు చేతులు మారినట్లుగా ప్రచారం జరగటంతో గురువారం ఇంటెలిజెన్స్ అధికారులు, సిబ్బంది పోస్టింగులపై సమాచారం సేకరించినట్టు తెలిసింది. ఎవరు ఎంత ఇచ్చారు..? ఎక్కడ పారదర్శకంగా పోస్టింగులు ఇచ్చారు..? అనే కోణంలో నిఘా వర్గాలు హోంశాఖ బాధ్యతలు కూడా నిర్వహిస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి నివేదిక అందించినట్టు తెలుస్తోంది. మొత్తానికి రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కమిషనరేట్ పరిధిలో పోలీస్ పోస్టింగుల్లో చేతులు మారిన వైనం రాష్ట్రవ్యాప్త చర్చకు తెరతీసింది.

కాంగ్రెస్‌లో టికెట్ రేస్!

(5వ పేజీ తరువాయి)

ఆసక్తికరంగా మారగా టికెట్ వస్తే చాలు ఉద్యోగాలకు రాజీనామా చేసి ఖద్దరు దుస్తులు ధరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో మహబూబాబాద్ ఎస్టీ రిజర్వుడు స్థానానికి భారీ పోటీ నెలకొంది. మహబూబాబాద్ డీఎస్పీగా పని చేసిన ఖమ్మం జిల్లా కేంద్రానికి చెందిన దుంగ్రోత్ నాగరాజునాయక్ కాంగ్రెస్ టికెట్ కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. అలాగే తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ప్రొఫెసర్ భట్టు రమేష్ కాంగ్రెస్ నుంచి మహబూబాబాద్ టికెట్ రేసులో ఉన్నారు. ప్రస్తుతం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో రిజిస్ట్రార్‌గా పని చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో ఎన్పీడీసీఎల్ డీఈగా పని చేస్తున్న మహబూబాబాద్ జిల్లా గూడూరు మండలం మర్రిమిట్ట గ్రామానికి చెందిన ఎట్టి వెంకన్న సైతం కాంగ్రెస్ టికెట్ ఆశిస్తున్నారు. అలాగే వరంగల్ ఎంపీ స్థానం కాంగ్రెస్ టికెట్‌కోసం ఉమ్మడి వరంగల్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న హరికోట్ల రవి తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఖమ్మం జిల్లాకు చెందిన హరికోట్ల రవికి వరంగల్ ఇన్‌చార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో సత్సంబంధాలు ఉన్నాయని, వీరి మద్దతుతో ఆయన ఇటీవల ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ అగ్రనాయకురాలు సోనియాగాంధీని కలిసి వచ్చారని సమాచారం. ఒకవైపు టికెట్ దరఖాస్తు చేసుకుంటేనే తమ గాడ్‌ఫాదర్ల ద్వారా ఆశావహులు టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాల్లో ఉన్నారు. దీంతో ఎవరికి టికెట్ దక్కుతుందో అనే ఉత్కంఠ నెలకొంది

'గృహజ్యోతి' వివరాలను దగ్గర ఉంచుకోండి..

ఎన్పీడీసీఎల్ ఎస్‌ఈ మధుసూదన్‌రావు

హనుమకొండ, ఫిబ్రవరి 8 (ఆంధ్రజ్యోతి : గృహజ్యోతి పథకం కింద ప్రజాపాలన సందర్భంగా అందచేసిన సమాచారాన్ని ధృవీకరణ కార్యక్రమం తమ సిబ్బంది నిర్వహిస్తున్నారని ఎన్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ మధుసూదన్‌రావు ఒక ప్రకటనలో తెలిపారు. తమ సిబ్బంది పరిశీలనకు వచ్చినప్పుడు ప్రజాపాలనలో అందచేసిన రశీదును, ఆహార భద్రతాకార్డు (రేషన్‌కార్డు) నెంబర్, ఆధార్ కార్డు నెంబర్‌ను అందుబాటులో ఉంచుకోవలసిందిగా ఆయన కోరారు. ఒక వేళ ఏదైనా కారణంవల్ల తమ సిబ్బంది వచ్చినప్పుడు అందుబాటులో లేకుంటే వివరాలను దగ్గరలోని విద్యుత్ సహాయ ఇంజనీర్ కార్యాలయంలోగానీ, లేదా విద్యుత్ సహాయక గణాంక అధికారి కార్యాలయంలో గానీ సమర్పించి ధ్రువీకరించుకోవాలని కోరారు.





భరత్‌కు నియామక పత్రాన్ని అందచేస్తున్న రవికుమార్

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా భరత్

గీసుగొండ, ఫిబ్రవరి 8: బీజేవైఎం జిల్లా అధ్యక్షుడిగా విద్యార్థి ఉద్యమ నాయకుడు ఎర్రగోళ్ల భరత్‌వీర్‌ను బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్ గురువారం నియమించారు. ఈ సందర్భంగా భరత్ పార్టీ జిల్లా కార్యాలయంలో మాట్లాడుతూ రానున్న ఎమ్మెల్సీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థిని గెలిపించడంతోపాటు పార్లమెంటు ఎన్నికల్లో 10 సీట్లు సాధించటమే లక్ష్యంగా పనిచేస్తానన్నారు. పదవి రావటానికి సహకరించిన రాష్ట్ర, జిల్లా నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్

'కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటా'

శంభునిపేట, ఫిబ్రవరి 8 : బీఆర్ఎస్ కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానని తూర్పు మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ అన్నారు. గురువారం రంగశాయిపేటలో 41,42 డివిజన్‌ల బీఆర్ఎస్ కార్యకర్తల సమావేశం నిర్వహించారు. నరేందర్ మాట్లాడుతూ ప్రత్యేక రాష్ట్రం కొరకు కేసీఆర్ నాయకత్వంలో పోరాడానని, తెలంగాణ పునర్ నిర్మాణంలోనూ పాలుపంచుకున్నట్లు వెల్లడించారు. తన తుది శ్వాస వదిలే వరకు బీఆర్ఎస్ పార్టీని వదిలేది లేదన్నారు. తనను నమ్ముకున్న కార్యకర్తలే తనకు బలమని వారికి చిన్న హానీ జరిగినా ఊరుకునేదే లేదనా హెచ్చరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్‌లో పోశాల పద్మస్వామి, గుండు చందనపూర్ణచందర్, మాజీ కార్పొరేటర్ కొంతం తార, డివిజన్ అధ్యక్షుడు కర్ర కుమార్ పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులకు టీషర్టులను అందజేస్తున్న జంగా రాఘవరెడ్డి

గీసుగొండ, ఫిబ్రవరి 8: క్రీడలతో దేహదారుఢ్యం పెరగటమే కాకుండా మానసికోల్లాసానికి ఎంతగానో తోడ్పడుతాయని ఖోఖో అసోసియేషన్ ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. గీసుగొండ జెడ్పీ పాఠశాలలో వారం రోజుల పాటు నిర్వహించిన ఖోఖో శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో వరంగల్ జిల్లా ఖోఖో జట్టు ప్రథమస్థానంలో నిలవాలన్నారు. అనంతరం కాంగ్రెస్ నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి రూ.45వేల సొంత ఖర్చులతో అందించిన టీషర్ట్, షాట్‌లను క్రీడాకారులకు జంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం పట్టాభి, అల్లం మర్రెడ్డి, శిక్షణ క్యాంప్ ఇన్‌చార్జి కోట రాంబాబు తదితరులు పాల్గొన్నారు. కాగా శిక్షణ శిబిరం నిర్వాహణకు గీసుగొండ గ్రామానికి చెందిన రిటైర్డ్ బ్యాంకు మేనేజర్ పెగళ్లపాటి లక్ష్మీనారాయణ రూ.20 విరాళాన్ని అందచేశారు.

రక్తదానంలో యువత ముందుండాలి



రక్తదానం నిర్వహిస్తున్న దృశ్యం

సంగెం, ఫిబ్రవరి 8: రక్తదానం చేసి ప్రాణాలు కాపాడడంలో యువత ముందుండాలని రెడ్ క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ పెద్ది వెంకట నారాయణ గౌడ్ అన్నారు. ఆర్టీవో కార్యాలయంలో రోడ్డు భద్రత వారోత్సవాలలో భాగంగా రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారి పాండురంగారావు మాట్లాడుతూ రోడ్డు భద్రతను ప్రతీ ఒక్కరు పాటించాలని, వాహనం నడిపే సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు కోల రవీందర్, సొసైటీ ప్రతినిధులు శ్రీనివాస్ రావు, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన నర్సింగ్ ఆఫీసర్లు

గిర్మాజిపేట, ఫిబ్రవరి 8 : వరంగల్‌లోని సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో 15 మంది నూతన నర్సింగ్ అధికారులు విధుల్లో చేరారు. సీకేఎం ఆస్పత్రిలోని మొత్తం 53 మంది నర్సింగ్ అధికారులకుగాను 317 జీవో ద్వారా 17మంది వివిధ జోన్లకు బదిలీ కావడంతో 17ఖాళీలు ఏర్పడ్డాయి. తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎంపికైనవారిలో 17 మందిని ప్రభుత్వం ఇక్కడ నియమించింది. గురువారం 15 మంది నర్సింగ్ అధికారులు రిపోర్టు చేశారు. మరో ఇద్దరు రిపోర్టు చేయాల్సి ఉంది. డిప్యూటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో వివిధ ప్రాంతాల నుంచి సీకేఎం ఆస్పత్రిలో పనిచేస్తున్న ఐదుగురు నర్సింగ్ అధికారులను విధుల నుంచి గురువారం సాయంత్రం రిలీవ్ చేశారు. అలాగే ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న సీకేఎం ఆస్పత్రికి చెందిన ఐదుగురు నర్సింగ్ అధికారుల డిప్యూటేషన్లు రద్దు చేసి సంబంధిత సమాచారాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు సీకేఎం ఆస్పత్రి కార్యాలయ అధికారులు పంపించారు. నూతన నర్సింగ్ అధికారులు విధుల్లో చేరడంతో సీకేఎం ఆస్పత్రిలో నర్సింగ్ అధికారుల కొరత తీరినట్లయిందని అంటున్నారు.

మతతత్వ విధానాలను వ్యతిరేకిద్దాం

ఆల్‌ట్రేడ్ యూనియన్స్



వేదికపై ఐక్యత చాటుతున్న కార్మిక నాయకులు

వరంగల్‌టౌన్, ఫిబ్రవరి 8: బీజేపీ మతతత్వ విధానాలను వ్యతిరేకిస్తూ 16న చేపట్టిన దేశవ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని ఆల్‌ట్రేడ్ యూనియన్స్ పిలుపునిచ్చింది. గురువారం పోచమ్మమైదాన్ డీసెంట్ ఫంక్షన్ హాలులో యూనియన్ జాయింట్ ప్లాట్‌ఫాం ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ముఖ్యఅతిథులుగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి గన్నారపు రమేష్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముక్కెర రామస్వామి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు రంగయ్య, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పుల్ల రమేష్, ఐఎఫ్‌టీయూ కార్యదర్శి గంగుల దయాకర్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి నర్ర ప్రతాప్ పాల్గొని మాట్లాడారు. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ వ్యవస్థలకు అనుకూలంగా వ్యవహరిస్తోందని, కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందని ఆరోపించారు. పార్లమెంట్‌లో మూడు రైతాంగ వ్యతిరేక చట్టాలను ఆమోదించిందన్నారు. 2015లో మోదీ పార్లమెంట్‌లో హామీ ఇచ్చిన కనీస మద్దతు ధర నేటికి నెరవేరలేదన్నారు. కార్యక్రమంలో అధ్యక్షవర్గంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మాలోతు సాగర్, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు పావం రవి, నాయకులు లింగమూర్తి, బడుగుల రాములు, రవి, పాషా, ప్రకాష్, యాకోబు పాల్గొన్నారు.

గీసుగొండ సీఐగా బాబులాల్



బాధ్యతలు స్వీకరిస్తున్న బాబులాల్

గీసుగొండ, ఫిబ్రవరి 8: గీసుగొండ సీఐగా జి.బాబులాల్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన వరంగల్ ట్రాఫిక్‌లో సీఐగా పనిచేశారు. కాగా ప్రస్తుతం టాస్క్‌ఫోర్స్‌లో విధులు నిర్వహిస్తూ గీసుగొండకు బదిలీ అయ్యారు. గతంలో ఇక్కడ పనిచేసిన సీఐ రామకృష్ణను ఐజీ కార్యాలయానికి అటాచ్ చేశారు.

మిల్స్‌కాలనీ సీఐగా మల్లయ్య



సీఐగా బాధ్యతలు చేపట్టిన పి.మల్లయ్య

కరీమాబాద్, ఫిబ్రవరి 8: మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌గా సీఐగా పి.మల్లయ్య గురువారం బాధ్యతలు స్వీకరించారు. సీపీ అంబర్ కిషోర్ ఝా ఆదేశాల మేరకు ఇక్కడ సీఐగా పనిచేసిన టి.సురేష్‌ను హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్‌కు అటాచ్ చేశారు. అలాగే వీసీఆర్ నుంచి పి.మల్లయ్యను మిల్స్‌కాలనీ సీఐగా విధులు నిర్వర్తించాలని ఆదేశించడంతో మల్లయ్య బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, రౌడీషీటర్లు తమ పద్ధతి మార్చుకోవాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. గురువారం బాధ్యతలు తీసుకోగానే మిల్స్‌కాలనీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లను సాయంత్రం స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. బాధ్యతలు చేపట్టే ముందు పి.మల్లయ్య ఏసీపీ బోనాల కిషన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

పెరుమాండ్ల లక్ష్మణ్‌పై కేసు నమోదు

మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో బల్దియా కమిషనర్ ఫిర్యాదు

జీడబ్ల్యూఎంసీ(హనుమకొండ సిటీ), ఫిబ్రవరి 8: చెరువుల పరిరక్షణ కమిటీ సామాజిక కార్యకర్త పెరుమాండ్ల లక్ష్మణ్‌పై మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. లక్ష్మణ్‌పై జీడబ్ల్యూఎంసీ కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఫిర్యాదు చేశారు. ఇందుకు దారి తీసిన పరిస్థితులను కమిషనర్ గురువారం మీడియాకు ఒక ప్రకటనలో తెలిపారు. లక్ష్మణ్ స్థాపించిన సంస్థకు ప్రభుత్వ పరమైన ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఇళ్ల నిర్మాణం జరుగుతోందని, ఇళ్ల నిర్మాణదారులను బెదిరించి డబ్బులు గుంజుతూ మోసం చేస్తున్నారని కమిషనర్ షేక్ రిజ్వాన్ బాషా ఆరోపించారు.

ఈ అంశంపై తమకు ప్రజల నుంచి ఫిర్యాదులు కూడా వచ్చినట్లు పేర్కొన్నారు. ఇటీవల సోమవారం జరిగిన ప్రజావాణిలో కూడా లక్ష్మణ్ అభ్యంతరకంగా ప్రవరించారని తెలిపారు. చెరువుల్లోని వ్యర్థాలను తొలగించాలనే లక్ష్మణ్ అభ్యర్థనపై సవివరంగా విషయాన్ని తెలియచేసినా తనను ఏకవచనంతో సంబోధించడంతోపాటు ఇతర బల్దియా అధికారులపై కూడా నోటి దురుసు, అభ్యంతరకరంగా ప్రవర్తించాడని తెలిపారు. ప్రజావాణికి ఇబ్బందులు కలుగచేశారని పేర్కొన్నారు. అధికారులను అవినీతిపరులంటూ వ్యాఖ్యలు చేసినట్లు తెలిపారు. లక్ష్మణ్ తీరుపై మట్టెవాడ పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఐపీసీ 353 ప్రకారం ఎఫ్ఐఆర్ నెం.36/2024 ద్వారా ఆయనపై కేసు నమోదు అయినట్లు తెలిపారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తాం..

జిల్లా టీఎన్జీవోస్ కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక



ఉద్యోగుల సమావేశంలో మాట్లాడుతున్న రాంకిషన్

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8: అపరిష్కృతంగా ఉన్న ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని జిల్లా టీఎన్జీవోస్ అధ్యక్షుడు గజ్జెల రాంకిషన్ అన్నారు. గురువారం జిల్లా టీఎన్జీవోస్ ఉద్యోగుల సమావేశం ములుగురోడ్‌లోని టీఎన్జీవోస్ భవన్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్లప్పుడు ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో టీఎన్జీవోస్ సంఘం అండగా ఉంటుందని తెలిపారు. జిల్లా అధ్యక్షుడిగా గజ్జెల రాంకిషన్, కార్యదర్శిగా గాజె వేణుగోపాల్, అసోసియేట్ అధ్యక్షుడిగా హేమానాయక్, కోశాధికారిగా పాలకుర్తి సదానందం, ఇతర పదవులు కార్యవర్గ సభ్యులుగా ప్రమీలావతి, వంశీధర్ బాబు, జగదీశ్వర్, మురళీధర్‌రెడ్డి, గద్దల రాజు, ఇంద్రాసేనా రెడ్డి, దుర్గారావు, యాకమ్మ, చందర్‌రావు, మధు, రమాదేవి, త్రివేణి, శ్రీజ్యోతి, తిరుమలదేవి, శరత్‌కుమార్, నూతన్‌ప్రసాద్ ఇతర సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమానికి టీఎన్జీవోస్ కేంద్ర సంఘం కార్యదర్శి వేముల వెంకటేశ్వర్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. సమావేశంలో హనుమకొండ, భూపాలపల్లి, సిటీ యూనిట్, ఎంజీఎం యూనిట్, మెడికల్ ఫోరం, వివిధ మండలాల అధ్యక్షులు హాజరయ్యారు.



కొండా మురళికి ఆహ్వాన పత్రికను అందిస్తున్న కమిటీ బాధ్యులు

బొడ్రాయి ప్రతిష్ఠాపనకు ఆహ్వానం

శంభునిపేట, ఫిబ్రవరి 8 :నగరంలోని రంగశాయిపేటలో ఫిబ్రవరి 11 నుంచి 14 వరకు నిర్వహించే గ్రామదేవతా ప్రతిష్ఠాపనా మహోత్సవాలకు రావాలని జిల్లా నాయకులకు, అధికారులకు కమిటీ బాధ్యులు గురువారం ఆహ్వాన పత్రికలు అందించారు. మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావుతో పాటుమాజీ మంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య, మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు ఎర్రబెల్లి ప్రదీప్‌రావు, జిల్లా అధ్యక్షులు గంటా రవి కుమార్, కాంగ్రెస్ నాయకులు గోపాల నవీన్‌రాజ్‌లతో పాటు వరంగల్ ఏసీపీ బోనాల కిషన్, మిల్స్‌కాలనీ సీఐ మల్లయ్య తహసీల్దార్ నాగేశ్వర్‌రావులను వారి కార్యాలయాల్లో కలిసి ఆహ్వాన పత్రికలు అందించారు. కార్యక్రమంలో ఆహ్వాన కమిటీ బాధ్యులు కేడల జనార్దన్, నాయిని అశోక్, సుధాకర్, బైరి రామేశ్వర్, పోశాల మల్లికార్జున్, కేడల మల్లికార్జున్, గంధ్రాతి కుమార్, లక్కాకుల రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



రఫీ(ఫైల్)

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 8 : కుటుంబ కలహాలతో ఉరి వేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురంలో గురువారం జరిగింది. ఎస్సై రవి తెలిపిన కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఎమ్డీ. రఫీ(30), యాస్మిన్ దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. రఫీ కూలీ పనులుచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొద్ది నెలలుగా భార్యాభర్తలకు తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురువారం ఇంట్లో ఎవరూలేని సమయంలో రేకుల షెడ్డుపైనున్న ఇనుపరాడ్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి మృతుని కుటుంబ సభ్యులకు సమాచారం అందిం చారు. మృతుడి తండ్రి జాకీర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

పల్స్ పోలియోను విజయవంతం చేయాలి

డీఎంహెచ్‌వో వెంకటరమణ



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరమణ

వరంగల్ కలెక్టరేట్, ఫిబ్రవరి 8: జిల్లా వ్యాప్తంగా జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కె. వెంకటరమణ అన్నారు. గురువారం జాతీయ పోలియో దినోత్సవం మార్చి 3న పురస్కరించుకొని జిల్లా వైద్య అధికారులకు, పర్యవేక్షకులకు వర్క్‌షాపు నిర్వహించారు.

ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో మాట్లాడుతూ జాతీయ పోలియో దినోత్సవం మూడు రోజులు నిర్వహిస్తారని పుట్టిన శిశువు నుంచి 5 సంవత్సరాల పిల్లల వరకు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పోలియో చుక్కల వేయడం జరుగుతుందన్నారు. మరో రెండు రోజులు ఆరోగ్యకేంద్రాలకు రాని పిల్లలకు క్షేత్రస్థాయి సిబ్బంది బృందాలుగా ఏర్పడి ఇంటింటికి వెళ్లి చుక్కలు వేస్తారని, హైరిస్క్ ఏరియాలో పిల్లలను గుర్తించి పోలియో చుక్కలు వేయాలని తెలిపారు. కార్యక్రమంలో విద్యాశాఖ ఐసీడీఎస్ , రెవెన్యూ, విద్యుత్ మొదలగు శాఖల అధికారులు, టీఎన్జీవోస్ పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వోలు గోపాల్‌రావు, ప్రశాంత్, అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన మీనాక్షి



మీనాక్షిని అభినందిస్తున్న హన్మకొండ కలెక్టర్ సిక్తా పటేల్

దుగ్గొండి, ఫిబ్రవరి 8: మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా విద్యాలయంలో 8వ తరగతి చదువుచున్న కె.మీనాక్షి రెజ్లింగ్ క్రీడలలో జాతీయస్థాయికి ఎంపికైంది. హన్మకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఈనెల 7,8 తేదీలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్ 15 విభాగంలో 39 కిలోల విభాగంలో మీనాక్షి పాల్గొని ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సాధించి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంజుల గురువారం తెలిపారు.

అదే విధంగా 9వ తరగతి చదువుతున్న డి.సమీరా అండర్15 విభాగంలో ప్రతిభ కనపరచి సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. జాతీయ స్థాయికి ఎంపికైన మీనాక్షిని, సమీరాలను హన్మకొండ కలెక్టర్ సిక్తా పటేల్, జీసీడీవో ఫ్లోరెన్స్, కస్తూర్బా విద్యాలయం ప్రత్యేక అధికారి మంజుల, ఉపాధ్యాయులు లావణ్య, రమ, సుభాషిని, స్రవంతి, సరస్వతి, పుష్పలీల, సంధ్యలు అభినందించారు.

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు అక్షయ



అక్షయను అభినందిస్తున్న హెచ్ఎం, పీఈటీలు

మామునూరు, ఫిబ్రవరి 8 : రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు బొజ్జం అక్షయ ఎంపికయ్యారు. బొల్లికుంట జడ్పీ హెచ్ఎస్ఎస్ పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న అక్షయ, పీఈటీ పాక శ్రీనివాస్ ప్రోత్సాహంతో ఫిబ్రవరి 3న హనుమకొండ జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన ఖోఖో పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు ఆనంద్ తెలిపారు. ఈనెల 9 నుంచి 11 వరకు భువనగిరిలో జరిగే సీనియర్ ఖోఖో జట్టులో బాలికల విభాగంలో అక్షయ పాల్గొనున్నట్లు వివరించారు. గురువారం అక్షయను పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తల్లిదండ్రులు అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ గట్టి గొప్పుల కేదారి, కీర్తి కుమారస్వామి, ఉపాధ్యాయులు, అలివేలు మంగ, పూల రవీందర్, చల్లా కృష్ణారెడ్డి, జయశ్రీ, మిట్టపల్లి శివాజీ పాల్గొన్నారు.

విద్యార్థి కిడ్నాప్‌నకు యత్నం?

ఉర్సు మైనారిటీ కాలనీలో కలకలం



ఉర్సు ప్రభుత్వ పాఠశాల వద్ద గుమిగూడిన స్థానికులు

శంభునిపేట, ఫిబ్రవరి 8 : మధ్యాహ్న భోజనం అనంతరం తిరిగి పాఠశాలకు వెళుతున్న ఓ విద్యార్థిని గుర్తుతెలియని వ్యక్తులు కిడ్నాప్ చేసేందుకు ప్రయత్నించారన్న ప్రచారం గురువారం వరంగల్ నగరంలో కలకలం రేపింది. నగరంలోని 42వ డివిజన్ ఉర్సు మైనారిటీ కాలనీకి చెందిన ఎండీ ఖలీల్, తస్లీమ్‌ల కుమారుడు ఇబ్రహీం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఇబ్రహీం గురువారం తమ పండుగ ఉందని మధ్యాహ్న భోజనం ఇంటి వద్ద చేసి వస్తానని పాఠశాలలో అనుమతి తీసుకొని భోజనానికి వెళుతుండగా కొందరు అతడిని అపహరించబోయరని చెప్పడం తీవ్ర చర్చనీయాంశమైంది. విషయం తెలుసుకున్న బాలుడి తల్లిదండ్రులు స్థానికులతో కలిసి పాఠశాలకు వెళ్లి ఆరా తీశారు. అనంతరం పోలీసులకు సమాచారమివ్వగా, మిల్స్‌కాలనీ పోలీసులు వచ్చి బాలుడితో మాట్లాడి వివరాలు తెలుసుకుని ధైర్యం చెప్పారు.

ఈ ఘటన గురిం చి ఇబ్రహీం చెప్పిన వివరాల ప్రకారం తాను ఇంటి వద్ద భోజనం చేసి తిరిగి పాఠశాలకు వెళుతుండగా ద్విచక్రవాహనాలపై పాఠశాల సమీపానికి వచ్చిన కొందరు ఆగంతకులు తనను పిలిచారని, దగ్గరకు వచ్చి తనను పట్టుకునే ప్రయత్నం చేశారంటూ కేకలు వేస్తూ పరుగు పెట్టానని చెప్పాడు. తనను పిలిచినవారిలో ఒకరు బురఖాలో ఉన్నాడని, వారి నుంచి తప్పించుకుని పాఠశాలలోకి వెళ్లానని తెలిపాడు. అయితే పిల్లలను అపహరించే ముఠాలు పలు ప్రాంతాల్లో తిరుగుతున్నాయంటూ రెండు, మూడురోజులుగా సోషల్ మీడియాలో వార్తలు చక్కర్లు కొడుతున్న క్రమంలో గురువారం వరంగల్ నగరంలో జరిగిన ఈ సంఘటనతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

ఆటోను ఢీకొన్న కారు...

● ఐదుగురికి గాయాలు



గాయపడిన టీచర్ పూర్ణిమ, విద్యార్థినులు

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 8 : కారు అదుపుతప్పి ఆటోను ఢీకొట్టిన ఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదుగురికి గాయాలైన ఘటన నర్సంపేట పట్టణంలోని నెక్కొండరోడ్‌లో గురువారం చోటు చేసుకుంది. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. చెన్నారావుపేట సిద్ధార్థ గురుకులంలో కొనసాగుతున్న దుగ్గొండి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థులు నర్సంపేట పట్టణంలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలు రాసి తిరిగి కళాశాలకు వెళ్తున్న క్రమంలో చెన్నారావుపేట నుంచి నర్సంపేటకు వస్తున్న కారు అదుపు తప్పి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు ఎ.ప్రీతి, రమ్య, సంతోష, టీచర్ పూర్ణిమ, ఆటో డ్రైవర్ రాజులకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సనందించారు. తీవ్రంగా గాయపడిన రమ్యను ఎంజీఎం ఆస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. ఇదిలాఉండగా విద్యార్థులను ప్రైవేట్ వాహనాల్లో పరీక్షలకు తరలించిన గురుకుల అధికారులపై చర్యలు తీసుకోవాలని, విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్సనందించాలని విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేష్, బాలకృష్ణ, రవీందర్‌లు డిమాండ్ చేశారు.

స్వశక్తి అభియాన్ విజయవంతం చేయాలి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 8: గావ్ చలో అభియాన్, మహిళా స్వశక్తి అభియాన్ కార్యక్రమాలు విజయవంతం చేసేందుకు కార్యకర్తలు కృషి చేయాలని మహిళా స్వశక్తి అభియాన్ వరంగల్ పార్లమెంట్ కో ఆర్డినేటర్ టి.కృష్ణప్రసాద్ అన్నారు. దేశాయిపేట రోడ్డులోని భారతీయ జనతా పార్టీ కార్యాలయంలో గురువారం గావ్ చలో అభియాన్, మహిళా స్వశక్తి అభియాన్‌పై సమావేశం నిర్వహించారు.

గావ్ చలో అభియాన్ కో ఆర్డినేటర్ డాక్టర్ వన్నాల వెంకటరమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి కృష్ణ ప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ బీజేపీ నాయకులు, బూత్ కమిటీ సభ్యులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొనాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు గంట రవికుమార్, నియోజకవర్గ కన్వీనర్ పొట్టి శ్రీనివాస్‌గుప్తా, నాయకులు సముద్రాల పరమేశ్వర్, బాకం హరిశంకర్ పాల్గొన్నారు.



రెజ్లింగ్‌లో జాతీయస్థాయికి ఎంపికైన మీనాక్షి



మీనాక్షిని అభినందిస్తున్న హనుమకొండ కలెక్టర్ సిక్తా పటేల్

దుగ్గొండి, ఫిబ్రవరి 8: మండలంలోని మల్లంపల్లి కస్తూర్బా విద్యాలయంలో 8వ తరగతి చదువుచున్న కె.మీనాక్షి రెజ్లింగ్ క్రీడలలో జాతీయస్థాయికి ఎంపికయ్యారు. హన్మకొండలోని జేఎన్ఎస్ స్టేడియంలో ఈ నెల 7, 8 తేదిలలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్15 విభాగంలో 39కిలోలలో కె.మీనాక్షి పాల్గొని ప్రతిభ చూపి గోల్డ్ మెడల్ సా ధించి జాతీయస్థాయి రెజ్లింగ్ క్రీడలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ మంజుల గురువారం వెల్లడించారు. అదేవిధంగా 9వ తరగతి చదువుచున్న డి.సమీరా అండర్15 విభాగంలో ప్రతిభ కనపరచి సిల్వర్ మెడల్ సాధించిందన్నారు. జాతీయస్థాయికి ఎంపికైన మీనాక్షిని, సమీరాలను హన్మకొండ కలెక్టర్ సిక్తా పటేల్, జీసీడీవో ఫ్లోరెన్స్, కస్తూర్బా విద్యాలయం ప్రత్యేక అధికారి మంజుల, ఉపాధ్యాయులు లావణ్య, రమ, సుభాషిని, స్రవంతి, సరస్వతి, పుష్పలీల, సంధ్య అభినందించారు.

మళ్లీ బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు , మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు

నర్సంపేట, ఫిబ్రవరి 8 : రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని నరేంద్రమోదీ సారథ్యంలో ఘనవిజయం సాధించి కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని బీజేపీ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు అన్నారు. పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో గురువారం గావ్‌చలో అభియాన్ కార్యక్రమంలో భాగంగా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి వారిని చైతన్యవంతులను చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. గత ఎన్నికల్లో కూడా అధికారం అందించిన ప్రజలు రాబోయే ఎన్నికల్లో రాజకీయాల కతీతంగా, జెండాల కతీతంగా పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించి మరోసారి మోడీని ప్రధానిని చేయాలని కోరారు. ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా భారతదేశం అవతరించబోతుందన్నారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ వడ్డెపల్లి నర్సింహ రాములు, కాంటెస్ ఎంఎల్ఏ క్యాండిడేట్ కంభంపాటి ప్రతాప్, బీజేపీ నాయకులు గోగుల రాణా ప్రతాప్ రెడ్డి, బీజేవైఎం నియోజకవర్గ అధ్యక్షుడు జూలూరి మనీష్, కౌన్సిలర్ శీలం రాం బాబు, మినుముల రాజు, నాయకులు నూనావత్ వీరన్న, కూనమల్లపృధ్వీరాజ్, గూడూరు సందీప్, జల్లిమధు, గంగిడి మహేందర్‌రెడ్డి, మహిళా నాయకులు సూత్రపు సరిత తదితరులు పాల్గొన్నారు.

కేరళపై కేంద్ర ప్రభుత్వ దాడులను ఖండించాలి

ఖానాపురం, ఫిబ్ర వరి 8 : కేరళ రాష్ట్రం పై బీజేపీ కేంద్ర ప్రభు త్వదాడులను ఖండిం చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యు లు భూక్య సమ్మయ్య అన్నారు. కేంద్ర ప్రభు త్వ వైఖరికి నిరసనగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో గురువారం అశోక్‌నగర్ గ్రామంలో కేంద్ర ప్రభుత్వ దిష్టి బొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా సమ్మ య్య మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాల హక్కులను కాలరాస్తూ రాష్ట్రాలపై కేంద్ర ప్రభుత్వం అధికారాన్ని చెలాయిస్తూ గవర్నర్ల పేరుతో రాష్ట్రాలపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతుందన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం తీసుకుంటున్న నిర్ణయాలను గవర్నర్ల ద్వార వ్యతిరేకించుకుంటూ తనకు గిట్టనటువంటి రాష్ట్ర ప్రభు త్వాలపై కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతుందని అన్నారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు తగిన బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు సాయిలు, గాదరి మల్లయ్య, ముంజాల రమేష్, సోమయ్య రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతీ ఒక్కరికి గృహజ్యోతి పథకం

వర్ధన్నపేట రూరల్, ఫిబ్రవరి 8 : అర్హులైన ప్రతీ ఒక్కరికి ప్రభుత్వం అందించే గృహజ్యోతి పథకం వర్తిస్తుందని వర్ధన్నపేట విద్యుత్ ఏడీఈ కన్న రాజు స్పష్టం చేశారు. గురువారం మండలంలోని ఇల్లందలో విద్యుత్ మీటర్ల అను సంధాన కార్యక్రమాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ విద్యుత్ అధికారులకు, సిబ్బందికి ప్రజలు సహకరించి పూర్తి వివరాలు అందించాలన్నారు. తప్పనిసరిగా ఆధార్ కార్డు, రేషన్‌కార్డు, ఫోన్ నంబరుతోపాటు ఆరు గ్యారెంటీల పథకానికి దరఖాస్తు చేసుకున్న రశీదును చూపించాలన్నారు. వాటిని ఆన్‌లైన్‌లో ప్రత్యేకంగా నమోదు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈనెల 200 యూనిట్లలోపు విద్యుత్తు వినియోగించుకున్న వారి వివరాలు సేకరిస్తున్నామని తెలిపారు. అభయహస్తం కార్యక్రమంలో భాగంగా ఉచిత విద్యుత్ దరఖాస్తులు చేసుకున్న నేపథ్యంలో యూనిట్ల వారీగా 200లోపు ఎంత మంది విద్యుత్ వినియోగించు కుంటున్నారనే వివరాలు సిద్ధంచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

• గృహజ్యోతికి వివరాల సేకరణ

రాయపర్తి: మండలంలోని పెర్కవేడులో గృహజ్యోతికి విద్యుత్ సిబ్బంది వివరాలు సేకరిస్తున్నారు. గురువారం గ్రామంలోని ప్రతి ఇంటికి విద్యుత్ బిల్లు రశీ దులు అందించేసమయంలో వారి పేర్లను, ఆధార్ కార్డును, ఫోన్ నెంబర్‌ను, రేషన్ కార్డు నెంబర్, ఆరు గ్యారెంటీల్లో దరఖాస్తు చేసుకున్న క్రమసంఖ్యను నమోదు చేసుకుంటూ ఆన్‌లైన్ లో పొందుపరుస్తున్నారు.

అక్రమ భూ రిజిస్ట్రేషన్‌పై సీసీఎల్ఏ విచారణకు కలెక్టర్ నివేదిక

నెక్కొండ, ఫిబ్రవరి 8 : నెక్కొండ మండలం దీక్షకుంట గ్రామానికి చెందిన మడత ఉప్పల లక్ష్మి తన భర్త కొమురయ్యకు సంబంధించిన భూమిని పోగాకుల లావణ్య అనే మహిళకు 2021 ఏప్రిల్ 12న అప్పటి తహసీల్దార్ అక్రమంగా ఆమె పేరుమిద రెండు ఎకరాల 20 గుంటల భూమిని రిజిస్ట్రేషన్ చేశారంటూ 2023 జనవరి 20న కలెక్టర్‌కు ఫిర్యాదు చేసింది. దీక్షకుంట గ్రామంలోని పలు సర్వే నెంబర్లలోని భూములను తన కుటుంబ సభ్యులతో ఎలాంటి సంబంధంలేని వ్యక్తి అయిన లావణ్యకు రిజిస్ట్రేషన్ చేసినట్లు ఫిర్యాదులో తెలిపింది. ఈ విషయమై సమగ్ర విచారణ జరిపి తదుపరి చర్యలు తీసుకోవాలంటూ సీసీఎల్ఏ (భూ పరిపాలన విభాగం)కు కలెక్టర్ సమర్పించిన నివేదికలో పేర్కొంది.

సమస్యల వలయంలో మద్ది మేడారం

- రూ.2 కోట్లు మంజూరైనా ఇంకా ప్రారంభం కాని పనులు
- ఆవేదన వ్యక్తం చేస్తున్న ఆలయ పూజారులు
- తల్లులకు మొక్కులు చెల్లించుకోనున్న సుమారు 3 లక్షల మంది భక్తులు



సమ్మక్క సారలమ్మ తల్లుల దేవాలయం



బీటీ రోడ్డుకు నోచుకొని మట్టి రోడ్డు



సమ్మక్క తల్లి వచ్చే రహదారి జలమయంగా ఉందని చూపిస్తున్న ఆలయ పూజారి నాగరాజు

నల్లబెల్లి, ఫిబ్రవరి 8 : వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం నాగరాజుపల్లిలోని మద్ది మేడారం సమ్మక్క సారలక్క సత్యంగల్ల తల్లులకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారు. అయితే జాతర సమీపిస్తున్నా వేళ.. జాతరలో ఇంకా సమగ్రమైన ఏర్పాట్లు పూర్తి కాకపోవడంతో సంబంధితాధికారులపై పలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవలే మద్ది మేడారంలో నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్యల సమక్షంలో సంబంధిత అధికారులతో జాతర పనులపై సమీక్ష సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జాతర పనులు త్వరగా పూర్తి చేయాలని సంబంధితాధికారులకు ఎమ్మెల్యే, కలెక్టర్‌లు ఆదేశించారు. కానీ ఇప్పటివరకు రోడ్డు పనులు, కరెంట్ పనులు, తాగునీటి పనులు, మరుగుదొడ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదని ఆలయ పూజారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

1963లో మద్ది మేడారం జాతర ప్రారంభం

మండలంలోని నాగరాజుపల్లి శివారులోని చింతల చెరువు కట్టపై ఉన్న ఈ జాతరను 1963 సంవత్సరం నుంచి గాంధీనగర్ గ్రామానికి చెందిన పూజారి దురిశెట్టి సమ్మయ్య, కుటుంబం నిర్వహిస్తున్నారు. అయితే 1976వ సంవత్సరంలో ఈ మద్ది మేడారం జాతరను ప్రభుత్వ దేవదాయ శాఖ గుర్తించింది. అప్పటి నుంచి ఈ మద్ది మేడారం జాతరకు వివిధ ప్రాంతాలైన వరంగల్, కరీంనగర్, ఖమ్మం ఉమ్మడి జిల్లాలతో పాటు ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల నుంచి ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు జరిగే ఈ జాతరకు సూమారుగా 3 లక్షల మందికి పైగా భక్తులు రానున్నారు. ఈ సమ్మక్క సారలక్క తల్లులకు మొక్కులు చెల్లించుకోనున్నారు.

పూజారులుగా దురిశెట్టి వంశీకులు

గాంధీనగర్ గ్రామానికి చెందిన దురిశెట్టి రమణమ్మ, నర్సయ్య దంపతుల ఇంటిలో 1963 సంవత్సరానికి ముందే పాముపుట్ట వెలిసింది. దీంతో నర్సయ్య అప్పటి నుంచి పాముపుట్టను సమ్మక్క, సారలక్క తల్లుల దేవతలుగా కొలిచేవారు. అనంతరం ఓ రోజు నర్సయ్యకు కలలోకి వచ్చిన సమ్మక్క, సారలక్క తల్లులు దేవతలు ప్రస్తుతం ఉన్న మద్ది మేడారం జాతర స్థలంలో కొలువుదీరుతామని, గుడి నిర్మాణం చేయాలని కోరారు. దీంతో గుడి నిర్మించడం తమతో కాదన్నారు. కానీ, అతి కొద్ది రోజులకే నర్సయ్య ఇంట్లో ఉన్న పాముపుట్టపై బంగారు తొట్టె, వెండి అందెలతో కట్టిన మూట, కంక బియ్యం లభించింది. దీంతో సమ్మక్క, సారలక్క తల్లుల ప్రతిరూప మహిమగా భావించి అప్పటి నుంచి జాతర కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం దురిశెట్టి నర్సయ్య కుమారుడు దురిశెట్టి సమ్మయ్య, మనువడు దురిశెట్టి నాగరాజులు ఆలయ ప్రధాన పూజారులుగా మద్ది మేడారం సమ్మక్క-సారలక్క జాతరను నిర్వహిస్తున్నారు.

ప్రధాన సమస్యలతో భక్తులకు ఇబ్బందులు

రూ. 2 కోట్లతో మంజూరైన బీటి రోడ్డు నిర్మాణ పనులు ఇంకా ప్రారంభం కాలేదు. రోడ్డు వెడల్పులో భాగంగా రైతులు తమ వ్యవసాయ భూములను కోల్పోతామనే దృక్పథంతో బీటీ రోడ్డు వేయడానికి రైతులు అంగీకరించడం లేదనే ఆరోపణ బలంగా ఉందని సంబంధితాధికారుల నుంచి వ్యక్తమవుతుంది. బీటి రోడ్డు పనులు ఇంకా ప్రారంభం కాలేదు. కానీ, ఈసారి జాతరకు వచ్చే భక్తులకు రోడ్డుతో ప్రధాన సమస్యే ఎదురౌతుందనే ఆరోపణ మాత్రం వినిపిస్తోంది. అలాగే రూ. 3 లక్షల వ్యయంతో తాత్కాలిక మరుగుదొడ్ల నిర్మాణ పనులు, రూ.4 లక్షల వ్యయంతో స్నానాలు చేసేందుకు షవర్లు, తాత్కాలిక డ్రెస్సింగ్ రూంలు, విద్యుత్, పారిశుధ్యం పనులు కూడా ప్రారంభం చేయాలి.

ఇప్పటికైనా మద్ది మేడారంలో పనులను ప్రారంభించాలని భక్తులు కోరుతున్నారు. లేదంటే ఈసారి జాతరకు వచ్చే భక్తులకు తీవ్రమైన ఇబ్బందులు ఎదురౌతాయని భక్తులు పేర్కొన్నారు. భక్తుల సౌకర్యార్థం కోసం వెంటనే సంపూర్ణంగా జాతర పనులను పూర్తి చేయాలని వేడుకుంటున్నారు.

జాతరపై నిర్లక్ష్యం వద్దు

దురిశెట్టి నాగరాజు, ఆలయ ప్రధాన పూజారి, మద్ది మేడారం



కొన్ని దశాబ్దాల నుంచి మద్ది మేడారం జాతర వైభవంగా జరుగుతుంది. కానీ, భక్తుల సౌకర్యాల ఏర్పాట్లు చేసే విషయంలో సమగ్రమైన ప్రభుత్వ నిధుల మంజూరులో ప్రతీసారి తీరని అన్యాయమే జరుగుతోంది. మద్ది మేడారం జాతరపై నిర్లక్ష్యం వహించడం సరైంది కాదు. జిల్లా అధికారులు ఈ జాతరపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి. అలాగే జిల్లా కలెక్టర్, ఐటీడీఏ పీవోలను పలు మార్లు కలిసి వినతిపత్రం రూపంలో ఇచ్చి నిధులు మంజూరు చేయాలని కోరాము. కానీ, అధికారులు నిర్లక్ష్యం చేశారు. అలాగే జాతరకు శాశ్వతమైన అభివృద్ధి పనులను భక్తుల సౌకర్యార్థం కల్పించాలి.

భక్తులకు ఎలాంటి లోటు రానీయం

గాదె సుదర్శన్, మద్ది మేడారం ట్రస్ట్ చైర్మన్, నాగరాజుపల్లి



మద్ది మేడారం జాతరలో సమగ్రమైన ఏర్పాట్లతో భక్తులకు ఏలాంటి లోటు రానీయం.. మంజూరైన బీటి రోడ్డును తాత్కాలికంగా నిలిపివేశాం. కొత్తగా జాతరకు రెండు వైపుల నుంచి మట్టి రోడ్డును నిర్మాణం చేపట్టాం. జాతరకు వచ్చే భక్తుల రవాణ సౌకర్యానికి ఇబ్బంది లేకుండానే రోడ్డును వేస్తాం. జాతరలో భక్తులకు విద్యుత్ సౌకర్యం, తాగునీటి వసతి, మరుగుదొడ్ల నిర్వహణ, పార్కింగ్ ఏర్పాట్లు, పారిశుధ్య నిర్వహణ తదితర ఏర్పాట్లను సమర్థవంతంగా పూర్తి చేస్తాం. భక్తులకు అన్ని రకాల సౌకర్యాలతో కూడిన ఏర్పాట్లుచేసి, ఏలాంటి లోటు రాకుండా చూసుకుంటాం.

అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తా



అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న మునిసిపల్ చైర్‌పర్సన్

వర్ధన్నపేట, ఫిబ్రవరి 8 : అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానని వర్ధన్నపేట మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ తెలిపారు. అవిశ్వాసం వీగిపోవడంతో వర్ధన్నపేట పట్టణ కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మునిసిపల్ చైర్‌పర్సన్ అంగోతు అరుణ మాట్లాడుతూ ఎవరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా ప్రజల ఆశీర్వాదంతో ముందుకు వెళ్లడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కోమాండ్ల ఎలేందర్‌రెడ్డి, కౌన్సిలర్లు రాజమణి, రామకృష్ణ తతదితరులు పాల్గొన్నారు.

ఆటోను ఢీ కొట్టిన కారు

• ఐదుగురికి గాయాలు



గాయపడిన టీచర్ పూర్ణిమ

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 8 : అదు పు తప్పిన కారు ఆటోను ఢీ కొట్ట డంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఐదు గురికి గాయాలైన సంఘటన నర్సంపేట పట్టణంలోని నెక్కొండరోడ్‌లో గురువారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం వివరాలిలా వున్నాయి. చెన్నా రావుపేట సిద్ధార్థ గురుకులంలో కొనసాగుతున్న దుగ్గొండి సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల కళాశాల విద్యార్థినులు నర్సంపేట పట్టణంలో ఇంటర్ ప్రాక్టికల్స్ పరీక్షలురాసి తిరిగి కళాశాలకు వెళ్తున్న క్రమంలో చెన్నారావుపేట నుంచి నర్సంపేటకు వస్తున్న కారు అదుపు తప్పి ఆటోను ఢీ కొట్టింది. దీంతో ఆటో బోల్తా పడడంతో అందులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు ఎ.ప్రీతి, రమ్య, సంతోష,టీచర్ పూర్ణిమ, ఆటో డ్రైవర్ రాజులకు గాయాలయ్యాయి.







గాయపడిన విద్యార్థినిలు

వెంటనే వీరిని నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్సలందించారు. తీవ్రంగా గాయపడిన రమ్యను ఎంజీఎం ఆస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. ఇదిలావుండగా విద్యార్థులు ప్రైవేట్ వాహ నాల్లో పరీక్షలకు తరలించిన గురుకుల అధికారులపై చర్య లు తీసుకోవాలని, విద్యార్థులకు మెరుగైన వైద్య చికిత్స లందించాలని విద్యార్థి సంఘాల నాయకులు బొట్ల నరేష్, బాలకృష్ణ, రవీందర్‌లు డిమాండ్ చేశారు.

జీపీ స్థలంలో అక్రమ కట్టడాలను నిలిపివేయాలని వినతి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 8 :మండల కేంద్రం లో గ్రామ పంచాయతీకి సంబంధించిన స్థలంలో అక్రమ కట్టడాలను నిలిపివేయాలని గురువారం కార్యదర్శి రాజేందర్‌కు గ్రామస్థులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మా ట్లాడుతూ చెన్నారావుపేట- నెక్కొండ ప్రధాన రహదారికి పక్కనే గ్రామ పంచాయతీకి చెందిన స్థలం శివాలయం ప్రాంగణంలో ఎలాంటి అను మతులు లేకుండా కంది గోపాల్‌రెడ్డి తన పేరు ప్రఖ్యాతి కోసం నూతనంగా హనుమాన్ విగ్రహ ఏర్పాటు కోసం నిర్మాణాలు చేపడుతున్నాడ న్నారు. గ్రామ పంచాయతీ స్థలాన్ని పరిరక్షించాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కుండె కుమారస్వామి, గట్ల రాంబాబు. లక్క కుమారస్వామి, వసీంఅక్రమ్, తోట రాము తదితరులు పాల్గొన్నారు.

దేశ సేవలో యువత భాగస్వాములు కావాలి

నర్సంపేట, ఫిబ్రవరి 8 : దేశసేవలో యువత భాగస్వాములు కావాలని కాంగ్రెస్ నాయకుడు, మునిసిపల్ ఫ్లోర్‌లీడర్ వేముల సాంబయ్యగౌడ్ పిలుపు నిచ్చారు. ఆర్మీలో 21 సంవత్సరాలు పని చేసి రిటైర్ అయిన ఎదల్లపల్లికి చెందిన ఆర్మీ జవాన్ (ఎన్‌బిసాబ్) రాజారెడ్డి నర్సంపేటకు గురువారం వచ్చిన సందర్భంగా ఆయనకు స్వాగ తం పలికి పూలమాలలు వేసి శాలువాతో సన్మా నించారు. ఈ సందర్భంగా సాంబయ్యగౌడ్ మా ట్లాడుతూ సమాజంలోని ప్రతీ యువకుడు దేశ రక్షణకుసేవలు అందించడంలో పోటీపడాలని ఆ యన పిలుపునిచ్చారు. దేశరక్షణ కోసం ఆర్మీలో పనిచేస్తూ సేవలు అందిస్తున్న జవాన్లకు సెల్యూ ట్ చెబుతూ వారి సేవలను యువత స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలన్నారు. దేశరక్షణ కోసం జవాన్లు అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని ఆయన కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు దండెం రథన్‌కుమార్, నాంపెల్లి వెంకన్న, ఎన్ఎస్‌యూ పట్టణ అధ్యక్షుడు కటారి ఉత్తమ్‌కుమార్, బాలు, కొమాండ్ల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

చెన్నమల్ల నర్సయ్య ఆశయాలను కొనసాగిద్దాం

నల్లబెల్లి, ఫిబ్రవరి 8: సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాజీ నాయకుడు, నారక్క పేట మాజీ సర్పంచ్ చెన్నమల్ల నర్సయ్య ఆశయాలను కొనసాగిద్దామని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి చిన్న చంద్రన్న అన్నారు. ఈ మేరకు నార క్కపేట గ్రామంలో సీపీఐ(ఎంఎల్) ప్రజా పంథా ఆధ్వర్యంలో గురువారం చెన్నమల్ల నర్సయ్య సంతాప సభను నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్న చంద్రన్న మాట్లాడుతూ.. 1981 నుంచి ఇటీవల అనారోగ్యంతో మరణించే వరకు పీడీత ప్రజల పక్షాన పోరాడిన వ్యక్తి చెన్నమల్ల నర్సయ్య అన్నారు. అంతేకాక, పోడు భూములను నిరుపేదలకు పంచడంలో కీలక పాత్రను పోషించాడన్నారు. ప్రజల మధ్యన తగాదాలను చాలా సులువు పర్కిరించేవాడన్నారు. నేటి యుతవ ఆయన ఆశయసాధనకై కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూనెం ప్రభాకర్, కొత్తపల్లి రవి, ఈర్ల పైడి, చిర్ర సూరి, నరసింహారావు, యోచన, మండల బీఆర్ఎస్ నాయకులు బానోతు సారంగపాణి, వక్కల చంద్రమౌళి తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో చేరిన నూతన నర్సింగ్ ఆఫీసర్లు

గిర్మాజిపేట, ఫిబ్రవరి 8 : వరంగల్‌లోని సీకేఎం ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో 15 మంది నూతన నర్సింగ్ అధికారులు విధుల్లో చేరారు. సీకేఎం ఆస్పత్రిలోని మొత్తం 53 మంది నర్సింగ్ అధికారులకుగాను 317 జీవో ద్వారా 17మంది వివిధ జోన్లకు బదిలీ కావడంతో 17ఖాళీలు ఏర్పడ్డాయి. తెలంగాణ మెడికల్ హెల్త్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ఎంపికైనవారిలో 17 మందిని ప్రభుత్వం ఇక్కడ నియమించింది. గురువారం 15 మంది నర్సింగ్ అధికారులు రిపోర్టు చేశారు. మరో ఇద్దరు రిపోర్టు చేయాల్సి ఉంది. డిప్యూటేషన్లను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయడంతో వివిధ ప్రాంతాల నుంచి సీకేఎం ఆస్పత్రిలో పనిచేస్తున్న ఐదుగురు నర్సింగ్ అధికారులను విధుల నుంచి గురువారం సాయంత్రం రిలీవ్ చేశారు. అలాగే ఇతర ప్రాంతాల్లో పనిచేస్తున్న సీకేఎం ఆస్పత్రికి చెందిన ఐదుగురు నర్సింగ్ అధికారుల డిప్యూటేషన్లు రద్దు చేసి సంబంధిత సమాచారాన్ని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులకు సీకేఎం ఆస్పత్రి కార్యాలయ అధికారులు పంపించారు. నూతన నర్సింగ్ అధికారులు విధుల్లో చేరడంతో సీకేఎం ఆస్పత్రిలో నర్సింగ్ అధికారుల కొరత తీరినట్లయిందని అంటున్నారు.

ఇన్‌స్పైర్‌లో రాష్ట్ర స్థాయికి ఉప్పరపల్లి విద్యార్థిని ఎంపిక



స్పందన

చెన్నారావుపేట, ఫిబ్రవరి 8 : మండలంలోని ఉప్పరపల్లి గ్రామ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అందె స్పందన ఇన్‌స్పైర్‌లో రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు హెచ్‌ఎం జయ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ వరంగల్ జిల్లా స్థాయిలో నిర్వహించిన పోటీల్లో విద్యార్థిని గాయపడిన చేతికి రూ. 300లతో ఖర్చుతో వినూత్న పరికరాన్ని తయారు చేసిందన్నారు. జిల్లా విద్యాశాఖ ధికారి వాసంతి, జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ కట్ల శ్రీనువాస్‌లకు ప్రాజెక్టు వివరాలను వివరించిందన్నారు. ఈ ఎగ్జిబిట్‌ను గైడ్ టీచర్ పిస్నింటి బాలాజీరావు సహకారంతో తయారు చేసిందని, రాష్ట్ర స్థాయికి ఎంపిక కావటం పట్ల ఉపాధ్యాయులు, పలువురు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సునీత, శశిధర్, మమత, సీహెచ్.మాధవి, మురళి, జాహేద్, ఇందిర, కృష్ణా, పీఈటీ రవీందర్, సుందర్, మమత, మాధవి, మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

నర్సంపేట టౌన్ సీఐగా బాధ్యతలు స్వీకరించిన రమణమూర్తి



బాధ్యతలు స్వీకరిస్తున్న రమణమూర్తి

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 8 : నర్సంపేట సీఐగా డి.రమణమూర్తి గురువారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన సార్ల రవికుమార్ మల్టీజోన్ ఐజీకి అటాచ్‌గా బదిలీ కాగా, మల్టీజోన్ ఐజీ కార్యాలయంలో అటాచ్‌గా పని చేసిన డి.రమణమూర్తి బదిలీపై వచ్చి ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు.

రాక్షస ప్రభుత్వం నుంచి ప్రజలకు విముక్తి కలిగింది



మండల పార్టీ నాయకులతో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

రాయపర్తి, ఫిబ్రవరి 8 : పాలకుర్తి నియోజకవర్గ ప్రజలు రాక్షస ప్రభుత్వం నుంచి విముక్తి కలిగించేలా తీర్పు ఇచ్చారని, వారికి సేవ చేయాల్సి బాధ్యత మనపై ఉందని కాంగ్రెస్ పార్టీ పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీ రాజేందర్‌రెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో నెలకొన్న సమస్యల పట్ల స్థానిక నాయకులు అవగాహన కలిగి ఉండాలన్నారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి దిశలో పయనించాలని ఆకాంక్షించారు. ఎవరు తప్పు చేసిన క్షమించేదిలేదని, అన్ని గ్రామాలు ఆదర్శంగా ఉండేలా చూడాలన్నారు. ఎమ్మెల్యే ఎన్నికల్లో కష్టపడిన ప్రతీ ఒక్కరికి భవిష్యత్తులో అండగా ఉంటామని సూచించారు. పాలకుర్తి ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్నంత కాలం అవినీతికి చోటు లేదని, భూ కబ్జాలు చేసిన వారిని వదిలి పెట్టమని హెచ్చరించారు. తప్పు చేసిన వారు శిక్ష అనుభవించక తప్పదని, క్రమ శిక్షణ కలిగిన రాజకీయాలు చేసేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న ప్రతీ సంక్షేమ పథకాన్ని ప్రజలకు అందేలా చూస్తామన్నారు. నియోజకవర్గ ప్రజల కళ్లలో ఆనందం చూడడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. సమావేశంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హమ్యా నాయక్, మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, వివిధ గ్రామాల అధ్యక్ష కార్యదర్శులు, నాయకులు పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో ఆత్మహత్య



రఫీ(ఫైల్)

నర్సంపేట టౌన్, ఫిబ్రవరి 8 : కుటుంబ కలహాలతో ఉరివేసుకొని ఒకరు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలోని కమలాపురంలో గురువారం జరిగింది. ఎస్సై రవి తెలిపిన కథనం ప్రకారం... గ్రామానికి చెందిన ఎం.డి. రఫీ(30), యాస్మిన్ దంపతులకు ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. రఫీ కూలీ పనులుచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గత కొద్ది నెలలుగా భార్యాభర్తలకు తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో గురు వారం ఇంట్లో ఎవరూలేని సమయంలో రేకుల షెడ్డుపై నున్న ఇనుపరాడ్‌కు చున్నీతో ఉరివేసుకొని ఆత్మ హత్యకు పాల్పడ్డాడు. స్థానికులు గమనించి మృతుని కుటుంబ సభ్యు లకు సమాచారం అందించారు. మృతుడి తండ్రి జాకీర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

మాటుకుంటను పునరుద్ధరించాలి

పర్వతగిరి, ఫిబ్రవరి 8: మండలంలోని జమాల్‌పురం గ్రామంలోని మాటు కుంటను పునరుద్ధరించాలని పలువురు రైతులు కోరుతున్నారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ మాటుకుంట ద్వారా గతంలో సుమారు వంద ఎకరాల వరకు నీరు అందేదని, ప్రస్తుతం కుంట మొత్తం పూడుకుపోయి చెట్లు పెరగడంతో నీటి సామర్థ్యం తగ్గిందన్నారు. కుంటలో పూడిక తీయించి, తూములను ఏర్పాటు చేస్తే మరో వంద ఎకరాల వరకు ఆయకట్టు పెరుగుతుందని, ప్రభుత్వం, అధికారులు ఆ దిశగా చొరవ తీసుకోవాలని రైతులు, గ్రామస్థులు కోరుతున్నారు.

మహిళా కాంగ్రెస్ మండల కమిటీ ఎంపిక

దుగ్గొండి, ఫిబ్రవరి 8 : మహిళా కాంగ్రెస్ మండల కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నేటి పార్వతమ్మ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తోకల శ్రీనివాస్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు ఎర్రెల బాబులు గురువారం మండల కేంద్రంలో ప్రకటించారు. మండల అధ్యక్షురాలిగా వెండి సక్కుబాయి (మర్రిపల్లి), మండల వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బుర్రి సునీత (మదిర), మండల ఉపాధ్యక్షురాలిగా అక్కపెల్లి రమ(తిమ్మంపేట), మునుకుంట్ల సుజాత(పొనకల్), కోశాధికారిగా నల్లకాంత (తొగర్రాయి) ఆర్గనైజర్‌గా భూమ సుజాత (మల్లంపెల్లి) లను ఎంపిక చేసినట్లు పార్వతమ్మ తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్లు ఒలిగె నర్సింహారావు, చెన్నూరి కిరణ్‌రెడ్డిలు పాల్గొన్నారు.

16న గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలి

చెన్నారావుపేట, ఫిబ్రవరి 8 : కేంద్ర ప్రభుత్వ రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ప్రతిఘటించాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఈసంపెల్లి బాబు అన్నారు. గురువారం కార్మిక, కర్షక సంఘ సమావేశాన్ని మండల కేంద్రంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలకు హామీలు ఇచ్చిన కేంద్ర ప్రభుత్వం పది సంవత్సరాలుగా దేశం దివాళా తీసిందన్నారు. ఆహార వస్తువులపై జీఎస్టీ విధించడంతో సామాన్యుల నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. ఫిబ్రవరి 16న జరిగే గ్రామీణ బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పరికి మధుకర్, జిల్లా అధ్యక్షుడు నమిండ్ల స్వామి, జిల్లా కార్యదర్శి భూక్య సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పది విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

చెన్నారావుపేట, ఫిబ్రవరి 8 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు గురువారం లీడ్ ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో పరీక్ష సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దాత ములక సాంబయ్య మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులు కష్టపడి చదివి 10/10 జీపీఏను సాధించాలన్నారు. వారికి ప్రత్యేక బహుమతులు అందిస్తామన్నారు. లీడ్ ఫౌండేష్ చైర్మన్ కాసుల రవి మాట్లాడుతూ జీపీఏ 10/10 సాధించిన విద్యార్థి పేరు మీద పాఠశాలలో లైబ్రరీని ఏర్పాటు చేస్తామన్నారు. అనంతరం విద్యార్థులకు పరీక్ష ప్యాడ్, పెన్నులు, పుస్తకాలను అందించారు. ఈ కార్యక్రమంలో యోగా మాస్టర్ ముల్క ఐలయ్య, హెచ్‌ఎం పాపమ్మ, కిషోర్, ఉమాదేవి, రజిని, అనిల్‌కుమార్, సిద్ధ కుమార స్వామి, రాకేష్, సీఆర్‌పీ సంపత్ తదితరులు పాల్గొన్నారు.

లోకోస్ యాప్‌లో సంఘాల వివరాలు నమోదు చేయాలి

రాయపర్తి, ఫిబ్రవరి 8 : గ్రామాల్లోని మహిళా సంఘాల పూర్తి వివరాలు లోకోస్ యాప్‌లో నమోదు చేయాలని డీఎంజీ సంపత్ సూచించారు. గురువారం మండల కేంద్రంలో స్వర్ణ బారతి మండల సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళా సం ఘాల పూర్తి వివరాలు, రుణాల సమాచారం నమోదు చేయాలన్నారు. పారదర్శకంగా సంఘాలు నడిచేలా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయానికి అనుగుణంగా పనిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఎంటీ కవిత, సీసీ దేవేంద్ర, వీవోఏలు పాల్గొన్నారు.